తెలంగాణ జాతీయ దినపత్రిక

# ప్రజా మంటలు

సంపుటి : 4
సంచిక : 28
పేజీలు - 8
వెల- రూ 5:00
prajamantalu.com

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శనివారం 17, జూన్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## కచ్ ప్రాంతంలో తీరం దాటిన తుఫాన్



2లో..

## కాశ్మీర్‌లో ఐదురుగు ఉగ్రవాదుల హతం

### చొరబాట్లను నిరోధించే క్రమంలో ఎన్‌కౌంటర్



శ్రీనగర్,జూన్16 : ఉత్తర కశ్మీరు సరిహద్దు జిల్లా కుప్వారాలో శుక్రవారం భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పులలో ఐదుగురు విదేశీ ఉగ్రవాదులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. కుప్వారాలోని జుమాగండ్ ప్రాంతంలో సైన్యం, పోలీసులు సంయుక్తంగా జరిపిన ఎదురుకాల్పులలో ఉగ్రవాదులు మరణించారని కశ్మీరు అదనపు పోలీసు అదనపు డైరెక్టర్ జనరల్ మిగతా 2లో..

## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి

### ఘనంగా స్వాగతించిన గవర్నర్, సిఎం కెసిఆర్

హైదరాబాద్,జూన్16 : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు వచ్చారు. బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు. గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, బీజేపీ ఎంపీ,కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా స్వాగతం పలికారు.

సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీలు సంతోష్ కుమార్, వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీలు మధుసూద నాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్‌తో పాటు పలువురు రాష్ట్రపతికి స్వాగతం పలికారు. ద్రౌపది ముర్ము విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు



చేరుకొని, రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమిలో నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రీవ్యూయింగ్ ఆఫీసర్‌గా హాజరవుతారు. పరేడ్ అనంతరం తిరిగి ఢిల్లీకి వెళ్లిపోతారు.

## పట్టణ ప్రగతితో మున్సిపాలిటీల అభివృద్ధి

### ప్రగతి దినోత్సవంలో మంత్రి వేముల



నిజామాబాద్,జూన్16 : పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో శుక్రవారం నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులోకి తెస్తూ పురపాలక రూపురేఖలు మార్చాలనే సంకల్పంతోనే ప్రభుత్వం పట్టణ మిగతా 2లో..

## కోట్లాది నిధులతో ధర్మపురి అభివృద్ధి

### సంక్షేమ శాఖల మంత్రి ఈశ్వర్

### రామ కిష్టయ్య సంగన భట్ల



దశాబ్దాల నిర్లక్ష్యానికి గురై, సమస్యల వలయంలో చిక్కుకుని ఉన్న ధర్మపురి క్షేత్రాన్ని కోట్లాది నిధులతో అనూహ్య అభివృద్ధిని చేస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలలో భాగంగా శుక్రవారం ధర్మపురి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో మంత్రి ఈశ్వర్ పాల్గొన్నారు. మంత్రి కొప్పుల మాట్లాడుతూ... నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని ధర్మపురి మేజర్ పంచాయితీని జనాభా, ఓటర్లు తక్కువగా ఉన్నా, సీఎం కేసిఆర్ తో చర్చించి స్పెషల్ కేస్ గా మున్సిపాలిటీగా చేశామన్నారు. కేసిఆర్ కు ప్రత్యేక దృష్టి ఉన్న నేపథ్యంలో 100 కోట్లు దేవస్థానానికి, 10 కోట్లు ముందిపాలిటీకి, అలాగే కేటీఆర్ చొరవతో 50కోట్లు నిధులు మంజూరీ పొందామన్నారు. 8కోట్లతో మెగా డ్రైనేజ్, 50పడకల ఆసుపత్రులు, దయాల్సిస్, ఆక్సీజన్ సౌకర్యాలు, చింతామణి, తమ్మళ్ళ కుంట సుందరీకరణ, సమీకృత మార్కెట్, శ్మశాన వాటిక, రోడ్ల విస్తరణ, కొత్త రోడ్లు, విద్యుత్ సబ్ స్టేషన్, నూతన స్తంభాలు, కొత్త వాటర్ ట్యాంకులు, సిపి డబ్లు నీటి పథక ఆధునీకణ, మంగలి గడ్డ అభివృద్ధి, రత్నాకర్ రావు విగ్రహ ఏర్పాటు, కాలేజీ మినీ స్టేడియం, ఇలా ఎన్నో పనులు ప్రారంభించామని, కొన్ని పూర్తి, కొన్ని ప్రగతి లో ఉన్నాయన్నారు. 2కోట్ల 70లక్షల చెక్కులను మెప్మా ద్వారా స్వశక్తి సంఘాలకు రుణాలగా అందజేశారు. పారిశుధ్య కార్మికులు, ఆర్పీలు, అధికారులు, సిబ్బందిని సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్ నిర్వహించిన కార్యక్రమము లో చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ చైర్మన్ రామయ్య, మార్కెట్ చైర్మన్ రాజేశ్ కుమార్, జెడ్పీటీసీలు అరుణ, సుధారాణి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఉదయం సత్తమ్మ కార్యాలయంలో పతాక ఆవిష్కరణ చేయగా, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ర్యాలీని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు.

## 25 జిల్లాలో మెడికల్ కాలేజీల ఏర్పాటు పూర్తి

- మిగతా 8 జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి
- కెసిఆర్ సంకల్పం మేరకు పని చేయండి
- అధికారులకు మంత్రి హరీష్ రావు ఆదేశం



హైదరాబాద్,జూన్16: రాష్ట్రంలోని 33 జిల్లాలకు గానూ ఇప్పటివరకు 25 జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు తెలిపారు. మిగతా 8 జిల్లాల్లోనూ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తద్వారా జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ సంకల్పాన్ని పూర్తి చేయాలన్నారు. మంత్రి హరీశ్‌రావు శుక్రవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 8 జిల్లాల్లో వచ్చే ఏడాది మెడికల్ కాలేజీలు ప్రారంభించేలా ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి భూసేకరణ, ఇతర పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఎన్‌ఎంసీ మార్గదర్శకాల ప్రకారం కాలేజీలు ఏర్పాటు చేయాలని సూచించారు.గత ప్రభుత్వాలు 60 ఏండ్లలో 3 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, తెలంగాణ ప్రభుత్వం తొమ్మిదేండ్లలోనే 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. అతి తక్కువ సమయంలో 21 కాలేజీలు ప్రారంభించి దేశంలోనే రికార్డు సృష్టించామని స్పష్టం చేశారు. ఆయా కాలేజీలు ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం నడిచేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సూపరింటెండెంట్లపైన ఉందన్నారు. తరగతుల నిర్వహణ, అనుమతుల రెన్యువల్ విషయంలో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు.

## జర్నలిస్టుల ఇంటిస్థలంపై కెసిఆర్ కుటుంబం కన్ను

- సుప్రీం తుది తీర్పు వచ్చినా భూమి ఇవ్వని ప్రభుత్వం
- పేటబషీరాబాద్ స్థలం వెంటనే అప్పగించాలి
- లేకుంటే జర్నలిస్టులకు మద్దతుగా పోరాడుతాం
- పేటబషీరాబాద్‌ను సందర్శించిన బండి సంజయ్



హైదరబాద్,జూన్16 : సుప్రీం ధర్మాసనం తీర్పును గౌరవించి జర్నలిస్టుకలు కేటాయించిన ఇంటి స్థలాన్ని వెంటనే అప్పగించాలని సిఎం కెసిఆర్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మిగతా 2లో..

## ప్రజానాడి




## కచ్ ప్రాంతంలో తీరం దాటిన తుఫాన్

- గాలు వేగానికి కూలిన విద్యుత్ స్తంభాలు,చెట్లు
- విద్యుత్ నిలిచి పోవడంతో అంధకారంలో పలు గ్రామాలు
- భారీ స్థాయిలో కురుస్తున్న వర్షంతో జనజీవనం అతలాకుతలం
- మేకలను రక్షించేందుకు వెళ్లిన తండ్రీకుమారుల గల్లంతు
- రాష్ట్రంలో 99 రైళ్లను రద్దుచేసిన రైల్వే శాఖ

2లో..

## నగర పౌరులకు మరింత సత్వర సేవలు

- అందుబాటులోకి వచ్చిన వార్డు కార్యాలయాలు
- సిటిజన్ చార్టర్‌కు అనుగుణంగా ప్రజలకు సేవలు
- కాచిగూడలో ప్రారంభించిన మున్సిపల్ మంత్రి కెటిఆర్



హైదరాబాద్,జూన్16(ప్రజామంటలు)

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యద్భుత వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. పౌరసేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఏర్పాటుచేసిన వార్డు కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. కాచీగూడలో వార్డు ఆఫీసును మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీలో 150 డివిజన్లలో మంత్రులు, మేయర్, అధికారులు ప్రారంభించ నున్నారు. ఒక్కో వార్డులో 10 మంది అధికారులు అందుబాటులో ఉంటారు. పారిశుద్ధ్యం, విద్యుత్, టౌన్‌ప్లానింగ్ వంటి వాటిపై ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించనున్నారు. పురపాలనలో మరో సంస్కరణకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. వికేంద్రీకరణ, ప్రజలు కేంద్రంగా పాలనే తమ లక్షమని చెప్పారు. వార్డు కార్యాలయాల్లోనే మిగతా 2లో..

## ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం జరగాలి

- ఇందుకోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలి
- కాంగ్రెస్‌లో టిజెఎస్ విలీనం పూర్తి అబద్ధపు ప్రచారం
- స్పష్టం చేసిన ప్రొఫెసర్ కోదండరామ్



హైదరబాద్,జూన్16 : కాంగ్రెస్‌లో తెలంగాణ జన సమితి విలీనం అవుతందని కొంత కాలంగా జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ అధినేత కోదండరాం తిప్పికొట్టారు. కెసిఆర్ అరాచక పాలనను తొలగించేందుకు అందరితో కలసి పనిచేస్తామని అన్నారు. పార్టీని విలీనం చేయడం అన్న సమస్యే రాదని అన్నారు. హైదరాబాద్‌లో జూపల్లి కృష్ణారావుతో ఆయన సమావేశం అయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన .. కేసీఆర్ ను ఓడించడానికి కలిసి పని చేస్తాం కానీ.. విలీనం ప్రస్తావన అసలు లేదని స్పష్టం చేసారు. రాష్ట్రంలో ఉన్న నిరంకుశ పాలనను అంతమొందించి ఒక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం అందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని.. అలాంటి ఐక్యతను సాధించే లక్ష్యంతో తప్పకుండా పనిచేస్తామని అన్నారు. అయితే విలీనం అనే ప్రసక్తే రాదన్నారు. టీజేఎస్‌ను విలీనం చేయాలన్న ప్రతిపాదనతో తనను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ కలిసారనే వార్తల్లో వాస్తవం లేదని.. అసలు చర్చలే జరగలేదని కోదండరామ్ స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు కలవాల్సిన అవసరం ఉందని, ఇక్కడ కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాదని, ఒక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడంలేదని, నిరంకుశత్వం కొనసాగుతోందని.. దాన్ని అంతమొందిచడానికి అన్ని పార్టీలు కలిసి రావాల్సిన అవసరం ఉందని, రాబోయే ఎన్నికలపై రాష్ట్ర కమిటీ మీటింగ్‌లో చర్చలు జరిపి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో ప్రజాస్వామిక పాలన రావాలని, దాని కోసం మహాకూటమిగా ఏర్పాడాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ చైర్మన్ గా కీలక పాత్ర పోషించిన కోదండరాం.. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరలేదు. మిగతా 2లో..

## తెలంగాణలో కేసీఆర్‌కు నూకలు చెల్లాయి

- ధనిక రాష్ట్రాన్ని బొందగడ్డగా మార్చారు
- కెసిఆర్ ధన దాహానికి బలవుతున్న ప్రజలు
- రేవంత్ సమక్షంలో భారీగా చేరికలు



హైదరబాద్,జూన్16 : తెలంగాణలో కేసీఆర్‌కు నూకలు చెల్లాయని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇక తెలంగాణను పాలించే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ఈ దోపిడీ పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సి ఉందన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..కేసీఆర్ దోపీడికి 4 కోట్ల ప్రజలు బలి అయ్యారు. పదేళ్లలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ బొందలగడ్డ రాష్ట్రంగా మార్చారు. ఇక కేసీఆర్ అరాచక పాలనను భరించే ఓపిక ప్రజలకు లేదు. తెలంగాణను కేసీఆర్ నుంచి విముక్తి మిగతా 7లో..

# నగర పౌరులకు మరింత సత్వర సేవలు

(మొదటిపేజీ తరువాయి)

కనీస పౌరసేవలు, ఫిర్యాదులు పరిష్కారమవుతాయన్నారు. సిటిజన్ చార్టర్‌కు అనుగుణంగా ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి డివిజన్ కార్యాలయంలో 10 మంది అధికారుల బృందం ఉంటుందని, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయని ట్విట్టర్ వేదికగా తెలిపారు. జీహెచ్‌ఎంసీ తన స్వరూపాన్ని మరోసారి మార్చుకోనున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. నేటి నుంచి సరికొత్త పాలన అందుబాటులోకి వస్తున్నదని చెప్పారు. జీహెచ్‌ఎంసీలో వార్డు కార్యాలయాలనుఅందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పౌర సమస్యల పరిష్కారంలో నగర వాసులకు మరింతగా చేరువయ్యేందుకు ప్రభుత్వం కొత్త ఆలోచనలు చేసిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన వార్డు కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. కాచిగూడలో వార్డు కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వార్డు అధికారితోపాటు మొత్తంగా వార్డులో 10 మంది చొప్పున 150 వార్డులలో 1500 మంది అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండను న్నారు. దీంతో ప్రజా సమస్యలు అక్కడిక్కడే పరిష్కారం అవుతాయని చెప్పారు. సమస్యలు ఎంత సమయంలో పరిష్కారం చేయాలనే సిటిజన్ చార్టర్‌ను కూడా వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నా మని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగుపెడుతున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 4 కోట్ల జనాభా ఉన్నదని, అందులో హైదరాబాద్‌లోనే కోటి మందికిపైగా ఉన్నారని తెలిపారు. నగరంలో జనసాంద్రత చాలా ఎక్కువని చెప్పారు. కోటి మందికి సేవలు అందించేందుకు క్షేత్రస్థాయికి పాలనను విస్తరించామన్నారు. అధికారులు ప్రజలకు మరింత చేరువగా ఉండాలని వార్డు పరిపాలన తీసుకొచ్చామని వెల్లడించారు. గ్రామాలలో పంచాయతీ సెక్రెటరీ, ఇతర సిబ్బంది ఉంటారని, చిన్న చిన్న మున్సిపాలిటీలలో వార్డుకొక ఆఫీసర్ ఉంటారని చెప్పారు. మరి కోటికి పైగా జనాభా ఉన్న జీహెచ్‌ఎంసీలో 35,000 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. అందుకోసమే వార్డు కార్యాలయాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు.

## తుమ్మలపల్లి ప్రసాద్‌కు మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు



హైదరాబాద్ జూన్ 16 (ప్రజా మంటలు) : సుదీర్ఘకాలం ప్రజాశక్తి సంపాదక బాధ్యతలు నిర్వహించిన మోటూరు హనుమంతరావు స్మారకార్థం ప్రతి ఏటా ప్రకటిస్తున్న ఉత్తమ జర్నలిస్టు అవార్డును ఈ ఏడాది నవభూమి జర్నలిస్టు తుమ్మలపల్లి ప్రసాద్ కు ఇవ్వాలని అవార్డు కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్ నుండి వెలువడే నవభూమి పత్రికలో 2023 మార్చి 8న 'మగువా నీకు వందనం!' అన్న శీర్షికతో ప్రచురితమైన ఈ వార్తా కథనాన్ని ఆ పత్రిక బ్యూరో చీఫ్ తుమ్మలపల్లి ప్రసాద్ రాశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన 85 ఏళ్ల కప్పెర అనసూర్య తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన కోడలికి సేవలందిస్తున్న వైనాన్ని మానవీయ కోణంలో కథనం చేయడం ప్రశంసనీయమని కమిటీ అభిప్రాయపడింది. అలాగే ప్రజాశక్తి మండపేట విలేకరి పల్లి సుబ్బరాజు 'ఆఖరి మజిలీలోనూ తప్పని వివక్ష!' పేర దళితుల అవస్థపైన, ఈనాడు ప్రత్యేక ప్రతినిధి దుర్గా ప్రసాద్ 'ఊరు వలసపోతోంది' అన్న శీర్షికతో కర్నూలు, అనంతపురం జిల్లాలపైన రాసిన వార్తా కథనాలను ప్రత్యేకంగా అభినందించాలని కమిటీ సూచించింది. ప్రజాశక్తి సాహితీసంస్థ 2002 నుంచి మోటూరు స్మారక అవార్డును క్రమం తప్పకుండా (కరోనా రెండేళ్ళ మినహా) అందజేస్తున్నది. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తితో ప్రారంభించి తరువాత అనేక మంది జర్నలిస్టుల ప్రతిభావంతమైన కథనాలకు ఈ పురస్కారం లభించింది. ఈ ఏడాది అవార్డు కోసం క్షేత్ర స్థాయి వార్తా కథనాలను, ఫీచర్స్ను ఆహ్వానించగా, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మంచి స్పందన లభించింది. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన అవార్డు ఎంపిక కమిటీ ఈ నెల 13న సమావేశమై వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించింది. ఎంట్రీలు వైవిధ్యభరితంగాను, హృద్యంగాను, వాస్తవ పరిస్థితులకు దర్పణం పట్టేవిగాను ఉన్నాయని కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. పాల్గొన్నవారికి ఆయా పత్రికలకూ ధన్యవాదలు తెలియజేస్తున్నాము. ఈ నెల 20న పుట్టపర్తిలో జరిగే సభలో అవార్డు ప్రదానం చేయడం జరుగుతుందని ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి తాడేపల్లి.ఎంవిఎస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

## పెళ్లిపేరుతో లొంగదీసుకున్న జిమ్ ట్రైనర్

### యువతి ఫిర్యాదుతో కేసు నమోదు

హైదరాబాద్,జూన్16 : యువతి మీద జిమ్ ట్రైనర్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఫిలింనగర్‌లో చోటు చేసుకుంది. టోలిచౌకిలో గత కొన్నేళ్లుగా ఆసిమ్ (25) అనే వ్యక్తి జిమ్ నడిపిస్తున్నాడు. ఏడాది క్రితం అదే ప్రాంతంలో నివాసముంటున్న యువతి జిమ్‌లో జాయిన్ అయ్యింది. ఆమెతో పరిచయం పెంచుకున్న ఆసీమ్ ప్రేమ పేరుతో వెంటపడి వేధిస్తున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆసీమ్ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పెళ్లి మాట ఎత్తకుండా జిమ్ ట్రైనర్ ముఖం చాటేశాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులను బాధిత యువతి ఆశ్రయించింది. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై ఐపీసీ 376, 417,420, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఢిల్లీలో మోస్తరు వర్షం

న్యూఢిల్లీ,జూన్16 : బిపర్‌జాయ్ తుపాను ప్రభావం తాజాగా దేశరాజధాని ఢిల్లీ పై పడింది. తుపాను కారణంగా శుక్రవారం ఢిల్లీ దాని పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. బలమైన గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమ య్యాయి. రహదారులు నదులను తలపించాయి. వర్షం కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.మరోవైపు నేడు ఢిల్లీలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. 'దక్షిణ ఢిల్లీలోని వసంత్ కుంజ్, మాల్వియానగర్, కల్కాజీ, తుగ్లకాబాద్, ఛత్తర్‌పూర్, దేరమాండి సహా ఎన్ సీఆర్తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది. గంటలకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి' అని ఐఎండీ తెలిపింది.

## ఆదిపురుష్ థియేటర్ వద్ద హంగామా

### జ్యోతి థియేటర్ అద్దాలు ధ్వంసం చేసిన అభిమానులు

సంగారెడ్డి,జూన్16 : పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఆదిపురుష్' సినీ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే సినిమా కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న అభిమానులు సినిమాను ఆలస్యంగా ప్రదర్శన చేశారని ఓ థియేటర్ అద్దాలు ధ్వంసం చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని జ్యోతి థియేటర్‌లో ఈ ఘటన జరిగింది.సినిమా ప్రదర్శన ఆలస్యం కావడంతో గొడవకు దిగిన అభిమానులు.. థియేటర్ యాజమాన్యం సర్ది చెప్పడంతో సద్దుమణిగారు. అయితే, సినిమా ప్రారంభమయ్యాక సౌండ్ సిస్టం సరిగా లేక, డైలాగులు అర్థం కావడం లేదంటూ అభిమానులు మళ్లీ గొడవకు దిగారు. ఆగ్రహంతో ఊగిపోతూ థియేటర్ అద్దాలను పగలగొట్టారు.దీంతోథియేటర్‌యాజమాన్యం సినిమా ప్రదర్శనను నిలిపివేసింది.

## రియల్ వ్యాపారి కుమారుడి కిడ్నాప్

### రంగంలోకి దిగి గాలిస్తున్న పోలీస్ బృందాలు

హైదరాబాద్,జూన్16 : హైదరాబాద్‌లో 8వ తరగతి విద్యార్థి అదృశ్యం తీవ్ర కలకలం రేపుతోంది. మల్కాజ్‌గిరిలో నివాసముంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ గురువారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో హర్షవర్ధన్ మిసింగ్ కేసు మిస్టరీగా మారింది. హర్షవర్ధన్‌ను ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి సైతం రంగంలోకి దిగారు. ఆమె మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్‌ను వెళ్లి ఇన్‌స్పెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటికే బాలుడు ఆచూకీ కోసం నాలుగు టీంలు గాలిస్తున్నాయి. తమ కుమారుడిని కిడ్నాప్ చేశారని బాలుడి తల్లిదండ్రులు అంటున్నారు. ఇద్దరిపై తమకు అనుమానం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. రమేష్ అనే వ్యక్తిని పోలీసులు ఇప్పటికే అదుపులో తీసుకున్నారు. రమేష్‌కు.. హర్ష వర్ధన్‌కు మధ్య గతంలో ఆర్థిక వివాదాలు ఉన్నట్టు తెలుస్తోంది. త్వరలో కేసును ఛేదిస్తామని పోలీసులు చెబుతున్నారు.

## పట్టణ ప్రగతితో మున్సిపాలిటీల అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ప్రగతికి శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు తొమ్మిదేండ్లలో రూ.250 కోట్లను ఖర్చు చేశామని వివరించారు. స్వరాష్ట్ర సాధనతోనే ఈ ప్రగతి సాధ్యపడిందని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో నియో జకవర్గం నుంచి హేమాహేమిలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ భీమ్‌గల్ పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉండిపోయిం దన్నారు. సెంట్రల్ ÷నాన్స్ కమిషన్ అందిస్తున్న నిధులకు సరిసమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుండటంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలవుతోందన్నారు. లేకుంటే సెంట్రల్ ఫైనాన్స్ నిధులు బల్దియాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకే సరిపోయేవన్నారు.

# కచ్ ప్రాంతంలో తీరం దాటిన తుఫాన్

అహ్మదాబాద్,జూన్16 : అతి తీవ్ర తుఫాను బిపర్‌జాయ్ గుజరాత్ తీరాన్ని తాకింది. గురువారం రాత్రి కచ్ ప్రాంతంలోని లఖ్‌పత్ సమీపంలో తీరాన్ని తాకింది. దీని ప్రభావంతో గుజరాత్ తీరంలో భీకర గాలులు వీస్తున్నాయి. కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురుస్తున్నది. తుఫాను తీరాన్ని దాటే సమయంలో గంటకు 185 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. బిపర్‌జాయ్ తుఫాను కేంద్రం దాదాపు 50 కిలోమీటర్ల వ్యాసంతో ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అరేబియా సముద్రంలో పది రోజులకుపైగా కొనసాగిన తొలి తుఫానుగా ఇది నిలిచిపోతుందన్నారు. కాగా, గుజరాత్‌లోని తీరప్రాంతాల్లో బిపర్‌జాయ్ తుఫాను బీభత్సం సృష్టిస్తున్నది. బలమైన ఈదురుగాలుల ధాటికి వందల సంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. ఇండ్లు కూలిపోయాయి. సౌరాష్ట్ర, కచ్ తీరాలతోపాటు ద్వారకలోని గోమతి ఘాట్, దమణ్ ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగామారింది. భీకర గాలులతో కచ్ జిల్లాలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక మోర్బీ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటం తోపాటు 115 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. దీంతో చెట్లు కూలిపోగా, 300 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని అధికారులు తెలిపారు. దీంతో సుమారు 45 గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయన్నారు. తుఫాను కారణంగా ఇద్దరు మరణించగా, 22 మంది గాయపడ్డారని తెలిపారు.



దీని ప్రభావంతో గుజరాత్ తీరంలో భీకర గాలులు వీస్తున్నాయి. గంటకు 185 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. కచ్, సౌరాష్ట్ర తదితర ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురుస్తోంది. భావ్ నగర్ జిల్లాలో కురిసిన భారీ వర్షం కారణంగా వరద పోటెత్తింది. దీంతో లోయలో చిక్కుకున్న మేకలను రక్షించేందుకు వెళ్లి తండ్రి, కుమారుడు ప్రాణాలు కోల్పోయారు. గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా సిహోర్ పట్టణానికి సమీపంలోని భండార్ గ్రామం గుండా వెళ్తున్న లోయలోకి భారీగా వరద నీరు ప్రవహించింది. దీంతో లోయలో ఉన్న మేకలను రక్షించేందుకు రామ్ జీ పర్మార్ (55), అతని కుమారుడు రాకేష్ పర్మార్ (22) అక్కడికి వెళ్లారు. మేకలను కాపాడే క్రమంలో వరద ఉధృతి కారణంగా నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో 22 మేకలు కూడా మృతి చెందినట్లు తెలిపారు.కాగా, గుజరాత్‌లోని తీరప్రాంతాల్లో బిపర్‌జాయ్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. బలమైన ఈదురుగాలుల ధాటికి వందల సంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. ఇళ్లు కూలిపోతున్నాయి. సౌరాష్ట్ర, కచ్ తీరాలతోపాటు ద్వారకలోని గోమతి ఘాట్ , దమణ్ ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగామారింది. భీకర గాలులతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో తీర ప్రాంతాల్లోని దాదాపు 940 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు తుపాను తీరందాటిన ప్రాంత పరిసరాల్లో అధికారులు 144 సెక్షన్ విధించారు. ద్వారకలోని ప్రాచీన ఆలయం సహా స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలను, గిర్ సోమ్‌నాథ్ జిల్లాలోని సోమ్‌నాథ్ ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. . 18 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్టీఆర్ఎఫ్ బృందాలతోపాటు రోడ్లు,భవనాల శాఖకు చెందిన 115 బృంధాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. తుఫాను కారణంగా రాష్ట్రంలో 99 రైళ్లను రైల్వే శాఖ రద్దుచేసింది.

## ఆర్టీసీ మరో వినూత్న పథకం

- గ్రామీణ ప్రయాణికలు కోసం టీ-9 టికెట్
- వంద చెల్లిస్తే మహిళలు, సీనియర్ సిజిజన్లకు అనుమతి
- పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వెసలుబాటు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎండి సజ్జన్నార్



హైదరాబాద్,జూన్16 : గ్రామీణ, పట్టణ ప్రయాణికులకు ఆర్థికభారం తగ్గించేందుకు టీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్లలె వెలుగు బస్సులో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం 'టీ-9 టికెట్' అందుబాటులోకి తెచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో టీ-24, టీ-6, ఎఫ్-24 టికెట్లను ఇప్పటికే అందిస్తోన్న సంస్థ.. తొలిసారిగా గ్రామీణ, పట్టణ ప్రయాణికుల సౌకర్యార్థం టీ-9 టికెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో శుక్రవారం 'టీ-9 టికెట్' పోస్టర్‌ను టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ఆవిష్కరించారు. ఈ టికెట్ ఈ నెల 18ఆదివారం నుంచి పల్లె వెలుగు బస్సుల్లో కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. టీ-9 టికెట్' ప్లలె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు వర్తిస్తుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఈ టికెట్ చెల్లుబాటు అవుతుంది. ఈ టికెట్ ద్వారా 60 కిలోమీటర్ల పరిధిలో ఒక్కసారి రానూపోను ప్రయాణం చెయొచ్చు. 'టి-9 టికెట్' కు రూ.100 ధరగా టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. టోల్ గేట్ చార్జీలపైన మినహాయింపు ఇచ్చింది. దీంతో ఈ టికెట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతందని సంస్థ ప్రకటించింది. 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు వయసు ధృవీకరణ కోసం తమ ఆధార్ కార్డును కండక్టర్లకు చూపించి టి-9 టికెట్ పొందవచ్చు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఈ టికెట్లను కండక్టర్లు ఇస్తారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోనే ఈ టికెట్ చెల్లుబాటు అవుతుంది. పల్లె వెలుగు బస్సుల్లో ప్రతి రోజు సగటున 15 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అందులో మహిళలు, సీనియర్ సిటిజన్లు ఎక్కువగా ఉన్నారు. వారికి ఆర్థికభారం తగ్గించాలనే ఉద్దేశంతోనే బస్సుల్లో 'టి-9 టికెట్'కు టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఈ టికెట్ తో రూ.100 చెల్లించి 60 కిలోమీటర్ల పరిధిలో రానూపోను ప్రయాణించవచ్చు. గ్రామీణ, పట్టణ ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని సంస్థను ఆదరించాలి అని టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ కోరారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే టి-24, టి-6, ఎఫ్-24 టికెట్లను అందుబాటులోకి తెచ్చామని, వాటికి ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన వస్తోందని గుర్తు చేశారు. ఆ టికెట్లకు మంచి స్పందన వస్తుండటంతో తొలిసారిగా గ్రామీణ, పట్టణ ప్రయాణికుల కోసం 'టి-9 టికెట్'ను తీసుకువచ్చామని చెప్పారు. ఈ టికెట్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. 'టి-9 టికెట్' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)లు, పీవీ ముని శేఖర్, పురుషోత్తం, కృష్ణ కాంత్, సీటీఎం జీవన్ ప్రసాద్, సీఎంఈ రఘునాథరావు, సీఈఐటీ రాజశేఖర్, సీఎఫ్ఎం విజయపుష్ప, తదితరులు పాల్గొన్నారు.

## రావణకాష్టంలా ఈశాన్య రాష్ట్రం

ఇంఫాల్,జూన్16 : మణిపూర్‌లో అల్లర్లు కొనసాగుతున్నాయి. రెండు తెగల మధ్య ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం రావణకాష్టంలా తయారైంది. బుధవారం ఓ మహిళా మంత్రి ఇంటికి నిప్పుపెట్టిన ఆందోళనకారులు.. తాజాగా కేంద్ర మంత్రి ఆర్కే రంజన్ సింగ్ ఇంటిపై దాడిచేశారు. ఇంఫాల్‌లో కర్ఫ్యూవిధించడానికి నిరసిస్తూ.. గురువారం రాత్రి కోంగ్బా ప్రాంతంలో ఉన్న మంత్రి నివాసాన్ని సుమారు 1200 మంది ఆందోళనకారులు చుట్టుముట్టారు. ఇంటిపై పెట్రో బాంబులు విసిరారు. దీంతో ఇళ్లు కాలిపోయింది. అయితే ఆ సమయంలో మంత్రి ఇంట్లో లేరని పోలీసులు వెల్లడించారు. మంత్రి ఇంటిపై దాడి జరగడం ఇది రెండో సారి. గత నెలలో కూడా ఆందోళనకారులు చుట్టుముట్టగా.. భద్రతా సిబ్బంది గాలిలోకి కాల్పులు జరిపి చెదరగొట్టారు. అయితే రాత్రి జరిగిన దాడిని మాత్రం అడ్డుకోలేకపోయామని ఎస్కార్ట్ కమాండర్ దినేశ్వర్ సింగ్ చెప్పారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత సుమారు 1200 మంది మంత్రి ఇంటిని చుట్టుముట్టారని, అన్ని వైపుల నుంచి పెట్రోల్ బాంబులు విసిరారని తెలిపారు. ఆ సమయంలో ఐదుగురు సెక్యూరిటీ గార్డులు, తొమ్మిది మంది భద్రత సిబ్బంది, మరో ఎనిమిదిమంది అదనపు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో మే 3న రెండు వర్గాల మధ్య ఘర్షణలు మొదల య్యాయి. మైతీ సామాజికవర్గానికి ఎస్టీ హోదా ఇవ్వడాన్ని నాగాలు, కుకీ సామాజికవర్గానికి చెందినవారు వ్యతిరేకిస్తున్నారు. అల్లర్లు, హింసాత్మక ఘటనల్లో దాదాపు 120మందికిపైగా పౌరులు ప్రాణాలు కోల్పోగా, 350మందికిపైగా గాయపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు, ఆస్తులు ధ్వంసమవుతున్నాయి. 50వేలమందికిపైగా ప్రజలు నిరాశ్రయలయ్యారని ప్రభుత్వ వర్గాల సమాచారం.

## కాశ్మీర్‌లో ఐదురుగు ఉగ్రవాదుల హతం

విజయ్ కుమార్ తెలిపారు. మరణించిన ఆ ఐదుగురు విదేశీ ఉగ్రవాదులను ఇంకా గుర్తించవలసి ఉందని ఆయన చెప్పారు.ఉగ్రవాదుల కదలికలపై పక్కా సమాచారం అందడంతో సైన్యం, పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. కశ్మీరులో ఒకే ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించడం ఈ ఏడాదిలో ఇదే మొదటిసారి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భద్రతాదళాల కాల్పుల్లో ఉగ్రవాదులు హతమైన సంఘటనలు చాలా తగ్గిపోయాయి. స్థానికంగా చేరికలు తగ్గిపోవడంతో కశ్మీరు లోయలో క్రియాశీల ఉగ్రవాదుల సంఖ్య రెండంకలకే పరిమితమైనట్లు పోలీసులు చెబుతున్నారు.అయితే దేశంలోకి అక్రమ చొరబాట్ల నిరోధక చర్యల్లో భద్రతా దళాలు ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు జమ్మూ-కశ్మీరు పోలీసులు శుక్రవారం తెలిపారు. నియంత్రణ రేఖ వెంబడి కుప్వారా జిల్లాలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరు మరణించినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను సైన్యం, పోలీసులు సంయుక్తంగా గురువారం రాత్రి ప్రారంభించినట్లు చెప్పారు. కశ్మీరు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఉగ్రవాదులు అక్రమంగా మన దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నట్లు నిర్దిష్ట సమాచారం అందడంతో సైన్యం, పోలీసులు సంయుక్తంగా కౌంటర్ ఇన్‌ఫిల్ట్రేషన్ ఆపరేషన్‌ను గురువారం రాత్రి ప్రారంభించినట్లు తెలిపారు. ఉత్తర కశ్మీరులోని కుప్వారా జిల్లా, నియంత్రణ రేఖ వెంబడి జుమగుండ్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందన్నారు. ఈ ఎన్‌కౌంటర్లో ఐదుగురు ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయారని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇటీవల అనేక చొరబాటు యత్నాలను భగ్నం చేసినట్లు తెలిపారు.

## జర్నలిస్టుల ఇంటిస్థలంపై కెసిఆర్ కుటుంబం కన్ను

(మొదటిపేజీ తరువాయి)

బండి సంజయ్ డిమాండ్ చేశారు. తీర్పు వచ్చి 9 నెలలు కావస్తున్నా స్థలం అప్పగింతలో ఎందుకు నాన్చుతున్నారని మండిపడ్డారు. ఇది సుప్రీంను అవమానించడమేనని అన్నారు. హైదరాబాద్ నగరంలోని పేట్ బషీరాబాద్‌లో జర్నలిస్టులకు ఇచ్చిన ఇంటి స్థలాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ తదితులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కోసం 17 సంత్సరల క్రితం ఒక్కొక్క జర్నలిస్ట్ రూ.2 లక్షల డబ్బులు కట్టారని.. మొత్తం 12.50 కోట్ల డబ్బులు కట్టారని తెలిపారు. జర్నలిస్టుల స్థలం జర్నలిస్టులకు ఇవ్వాలని తీర్పు కూడా వచ్చిందన్నారు. అయితే కేసీఆర్ కుటుంబ సభ్యుల కన్ను ఈ భూమి మీద పడిందని... అందుకే పేట్ బషీరాబాద్ స్థలం ఇవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. జర్నలిస్ట్‌ల వల్లే నువ్వు ముఖ్యమంత్రి అయ్యావు కేసీఆర్.. నీ కుటుంబ సభ్యులు పదవులు అనుభవిస్తున్నారని అన్నారు. స్థలం కోసం వేచిచూసి 60మంది జర్నలిస్ట్ లు చనిపోయారని అన్నారు .జర్నలిస్ట్ నాయకులు కేసీఆర్ మోచేతి నీళ్ళు తాగుతున్నారని ఆరోపించారు. జర్నలిస్టుల సంక్షేమం గాలికి వదిలేశారన్నారు. జర్నలిస్టులకు స్థలం ఇస్తావా లేదా కేసీఆర్ అని ప్రశ్నించారు.

## పజాస్వామిక తెలంగాణ నిర్మాణం జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ జన సమితి పేరుతో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ పార్టీలతో కూడిన మహాకూటమిలో కలిసి పని చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలవద్దనే ఉద్దేశ్యంతో కూడా మహాకూటమిలో టీజేఎస్ చేరింది. అయితే అనుకూల ఫలితాలు రాలేదు. ఉద్యమ నేత రాజకీయ పార్టీ పెట్టినందున ప్రజల్లో అంచనాలు ఉన్నా? పార్టీ ఊహించిన స్థాయిలో బలోపేతం కాలేదు. ముదస్తు ఎన్నికల్లో సరైన ఫలితాలు రాకపోవడంతో కొంత మంది పార్టీని వీడి వెళ్లిపోయారు. ఆ తర్వాత పార్టీ నిర్మాణంపై దృష్టి సారించలేక పోయారు. ఆర్ఎస్ పాలనపై పూర్తి వ్యతిరేకంగా ఉన్న కోదండరాం ఎలాగైనా కేసీఆర్ గద్దె దించాలని చూస్తున్నారు. కానీ, కోదండరాం ఒక్కరితో అది అయ్యే పనికాదు. ఉద్యమ సారథిగా ఆయనకు తెలంగాణ పరిస్థితిపై పూర్తి అవగాహన ఉన్నందున కోదండరాంను కలుపుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఉద్యమకారునిగా ఆయన ఇమేజ్ పార్టీకి పనికి వస్తుందన్న ఉద్దేశంతో.. కాంగ్రెస్ పార్టీ విలీనానికి ప్రతిపాదిస్తోంది. కానీ కలిసి పని చేయడానికి సిద్ధమే కానీ.. విలీనానికి అంగీకరించేది లేదని ప్రొఫెసర్ చెబుతున్నారు.

## పట్టణ ప్రగతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్



జగిత్యాల జూన్ 16 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జగిత్యాల పట్టణంలో శుభమస్తు గార్డెన్స్ టౌన్ హాల్ లో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొని మున్సిపల్ పారిశుధ్య మరియు కార్యాలయ సిబ్బందినీ సన్మానించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ డా. నరేష్, డిఈ రాజేశ్వర్, ఏఏ శ్రీనివాస్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది,మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభోత్సవం

### ఎమ్మెల్యే కె. విద్యా సాగర్ రావు



కోరుట్ల టౌన్ జూన్ 16 (ప్రజామంటలు): కోరుట్ల పట్టణంలోని సాయి రాంపురం కాలనీలో 95 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్ ను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ.... పిల్లల మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతగానో దోహదపడ తాయని అలాగే పట్టణ వాసులకు యోగా చేసుకునేందుకు ఈ పార్క్ ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో పురపాలక సంఘాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్ మున్సిపల్ కమిషనర్ అయాజ్, స్థానిక కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మణ్, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీసిలందరికి ఆర్థిక సహాయం వర్తింపజేయాలి

### బిసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శికారి గోపి కృష్ణ



కోరుట్ల టౌన్ జూన్ 16 (ప్రజామంటలు): సబ్బండ వర్గాల త్యాగ ఫలి తమే తెలంగాణ అని రాష్ట్ర ప్రభుత్వం బీసిలందరికి ఆర్థిక సహాయం వర్తింపజేయాలని బిసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శికారి గోపి కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని బిసీ సామాజిక వర్గానికి న్యాయం చేయా లని డిమాండ్ చేశారు. బీసీ వర్గీకరణలో కొందరికే కాకుండా బిసీ సామాజిక వర్గానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం అందరికీ అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. దీని వల్ల వెనుకబడిన కులాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం వారి జీవనోపాధికి మెరుగు పడేందుకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

## గిరిజన బంధు అమలు చేయాలి




జనగామ జూన్ 16 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రం అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 17న గిరిజన ఉత్సవం నాడే గిరిజన బందు పథకాన్ని ప్రకటించి వెంటనే జీవో విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తేజావత్ గణేష్ నాయక్ డిమాండ్ చేశారు. జనగామలో శుక్రవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ తో పాటు గిరిజన బందు ఇది వరకే సీఎం ప్రకటించారని, హామిని నిలబెట్టుకోవాలని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం మాజీ జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్ , జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర సురేష్, నాయక్ జిల్లా నాయకులు, ఇస్లావత్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రామాయణం చరిత్ర ఆదిపురుష్



జనగామ జూన్ 16 (ప్రజామంటలు): రామాయణం చరిత్రతో తీయబ డిన ఆదిపురుష్ సినిమా ప్రదర్శింపబడుతున్న దేవి థియేటర్ ఎదుట బిజెపి, హిందూ సంఘాలు, ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో హనుమాన్ చిత్రపటానికి కొబ్బరికాయ కొట్టి, పూజా కార్యక్రమం నిర్వహించారు. బాణాసంచా పేల్చి, జై శ్రీరామ్ జై జై సీతారామంటూ నినాదాలు చేశారు. ప్రభాస్ ఫ్యాన్స్ కోసం ఉదయం 6:30 గంటలకు బెనిఫిట్ షో చూసిన అభిమానులు, హిందూ సంఘాల నాయకులు అద్భుతంగా ఉందని ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా సినిమా చూడాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ బిజెపి జిల్లా ఇన్చార్జి దశమంత రెడ్డి, శ్రీకాంత్, పిట్టల సత్యం , ప్రభాస్ ఫ్యాన్స్ సంపత్, ప్రభాస్ ఫ్యాన్స్ మురళి, ప్రభాస్ ఫ్యాన్స్ వీరి, బిజెపి, హిందూ సంఘం నాయకులు ప్రభాస్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

# ది ఫర్టైల్ బ్రేన్స్ అంతర్జాతీయ ఆంగ్ల సాహిత్య సంస్థ

### జూమ్ మీటింగ్‌లో రేణుకుంట్ల మురళి




జనగామ జూన్ 16 (ప్రజామంటలు): ది ఫర్టైల్ బ్రేన్స్ అంతర్జాతీయ ఆంగ్ల సాహితీ సంస్థ ఓపెన్ థీమ్ పై జూమ్ సమావేశం సంస్థ అధినేత కె.కుమార్ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రపంచ నలుమూలల నుండి కెనడా, యుకె, యుఎస్ఎ, పాకిస్థాన్, బ్రెజిల్, ఫిలిప్పీన్స్, సింగపూర్, ఇజ్రాయిల్, ఇండియా, గ్రీకు, నెదర్లాండ్స్, రోమానియా, దుబాయ్, నేపాల్, బంగ్లాదేశ్, జమైకా దేశాలనుండి నలభై మంది ప్రముఖ కవులు, రచయితలు పాల్గొని పర్యావరణ పరిరక్షణ, అమ్మ ప్రేమ, ప్రకృతి,నైతిక విలువలు మొదలైన అంశాలపై రాసిన కవితలను ఆలపించారని తెలంగాణ నుండి చురుకుగా పాల్గొంటున్న ఫర్టైల్ బ్రేన్స్ రాష్ట్ర కో-కన్వీనర్ రేణుకుంట్ల మురళి తెలిపారు.ఈ సమావేశంలో మనటిట హచిన్ సన్,సరస్వతి పోశ్వాల్,ఐజాక్ కొహెన్, డామినిక్ విన్ డ్రమ్, డాక్టర్ రూపా సర్కార్ గౌర్, రేయ్ విటాకర్, జూహీ గుప్తే, అనుపమ, జయ కల్యాణరమణ్, మీనా చౌవాన్, మైఖల్ ఆంతోనీ ఇంగ్రామ్, డానీ ఇన్నే, నైమ చంచౌన్, జాకీ చౌ, షాలిని నంద కియోల్కర్, గార్గి మిశ్రా, సుదిపా మిశ్రా, సోమదత్తా మిత్ర, అలెగ్జాండ్రా పొసరొపోలో, రాబర్ట్ ఫ్లెమింగ్, టిల్ కుమారి శర్మ, డాక్టర్ గంగలక్ష్మి పట్నాయక్, రీమా రాయ్ సింగ్, హీరా నవాజ్, దుర్గాచారి, రేణుకుంట్ల మురళి, సిల్వియా కేంగ్ అంగ్, శామ్యూల్ రేన్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జిల్లెల్ల సిద్ధారెడ్డి, లింగాల నర్సారెడ్డి,యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య , జాయ మల్లేష్ బండారు శ్రీనివాస్, ఎస్ టి సెల్ జనగామ పట్టణ అధ్యక్షులు కోట నాయక్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి, అర్షద్ రహమాన్, పిక్క బీరప్ప, బిర్రు సత్యనారాయణ, ముచ్చల రాజీరెడ్డి, తాటి కనుకస్వామి, బోరేల్లి సిద్ధులు, సానిక శ్రీశైలం, మోటె మల్లేష్ కోడెం నర్సింహులు, ఎనగందుల కృష్ణ, బూరెల రవి, పిట్టల సత్యనారాయణ,కొమ్మూరి యువసేన జనగామ మండల అధ్యక్షుడు బక్క ప్రవర్దన్, ఉపాధ్యక్షుడు గాజుల రాజు, యండి సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



జనగామ జూన్ 16 (ప్రజామంటలు): టీపీసీసీ, మాజీ టీపీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు జులై 2న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువకులు పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని పీసీసీ జనగామ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కొట్ల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం జనగామ నియోజకవర్గ కార్యాలయంలో ఆన్‌లైన్ క్విజ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కొట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో నిరుద్యోగంతో బాధపడుతున్న యువత కొరకు ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ ఆధ్వర్యంలో యూత్ నిరుద్యోగ డిక్లరేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ యూత్ డిక్లరేషన్ ను జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ ప్రతి గ్రామ గ్రామాన గడపగడపకి తీసుకొని వెళ్లాలని కోరారు. యువతీ యువకులు ప్రతి గ్రామంలో రాజీవ్ గాంధీ ఆన్లైన్లో క్విజ్ పోటీలో రిజిస్ట్రేషన్ చేసుకుని పరీక్షలో పాల్గొని తమ యొక్క నైపుణ్యతకు పరీక్షించాల్సిందిగా ఈ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి నియోజకవర్గం వారిగా బహుమతులు అందజేస్తారని తెలిపారు. అత్యధికంగా యువకులు ఈ పోటీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ చెంచారపు శ్రీనివాసరెడ్డి జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి లింగాజీ మద్దూరు జెడ్పిటిసి గిరికొండల్ రెడ్డి జనగామ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిరా కృష్ణ స్వామి చేర్యాల మండల అధ్యక్షులు ఆది శ్రీనివాస్ కొమరవెల్లి మండల అధ్యక్షులు గురువయ్య గౌడ్ తరిగొప్పుల మండల అధ్యక్షుడు సంపత్ చేర్యాల బ్లాక్ ప్రెసిడెంట్ నాగమల్ల శ్రీనివాస్ జనగామ మండల అధ్యక్షులు కొన్నే మహేందర్ రెడ్డి బచ్చన్నపేట మండల అధ్యక్షుడు వంగ వెంకట్ రెడ్డి మాజీ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు జక్కుల వేణుమాధవ్ ఓబీసీ జిల్లా అధ్యక్షులు లోక్కుంట్ల ప్రవీణ్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు సంపత్ నాయక్ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకులు చింత కింది మల్లేష్, చేర్యాల మున్సిపల్ కౌన్సిలర్ ముస్త్యాల యాదగిరి, జనగామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ మాజీద్, జనగామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్ట కృష్ణ జనగామ మండల ఎంపీటీసీ సలెంద్ర శ్రీనివాస్, మద్దూర్ మండల నాయకులు కనక చంద్రం, జనగామ పట్టణ ఉపాధ్యక్షులు సుల్తాన్ గోవింద్ రెడ్డి, జనగామ యూత్ ఉపాధ్యక్షులు సౌద మహేష్, చేర్యాల యూత్ కాంగ్రెస్ నాయకులు బూడిగే రమేష్, సోషల్ మీడియా కో కన్వీనర్ ఎండీ ఫయాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు ఎండీ అజామ్, పులిగిల్ల శివ, కాంగ్రెస్ నాయకులు మహేశ్వరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలలో పట్టణ ప్రగతి

### హిందూ కమ్యూనిటీ ఓపెన్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ



రాయికల్ జూన్ 16 (ప్రజామంటలు): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాయికల్ పట్టణం గుడికోట ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి 1 కోటి రూపాయలతో నిర్మించనున్న హిందూ కమ్యూనిటీ ఓపెన్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ. అనంతరం పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ కౌన్సిలర్ లు, సఫాయి కార్మికులను సన్మానించారు. 19 మెప్మా స్వయం సహాయక సంఘాలకు 1 కోటి 70 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మోర హనుమండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కమిషనర్ సంతోష్, కౌన్సిలర్లు కన్నాక మహేందర్, మారంపెల్లి సాయికుమార్, తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేష్, అజ్వారి బేగం, శ్రీరాముల సువర్ణ, మ్యాకాల కాంతారావు, కోఆప్షన్ లు మహేందర్ బాబు, సోహైల్, వనిత, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు ఎలిగేటి అనిల్ కుమార్, హుస్సేన్, మోర రామ్మూర్తి, అనుమల్ల చంద్ర తేజ, ప్రసాద్, దశరథం, విక్రమ్, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని ఆదుకోవడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం



### మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

జనగామ జూన్ 16 (ప్రజామంటలు): రైతాంగాన్ని ఆదుకోవడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పిసిసి సభ్యులు మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం జనగామలోని కొమ్మూరి క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటను కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వారికి డబ్బులు ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రైతులు పంట నష్టపరిహారం కోసం దాదాపు రెండు నెలలు నుండి ఎదురుచూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని,రైతు ప్రయోజనాలే ధ్యేయంగా రైతులకు నేనే పెద్ద మేలు చేస్తున్న అన్న పెద్ద రైతు కేసీఆర్ మరి రాష్ట్రంలో రైతులు సీజన్ ప్రారంభం అయి పెట్టుబడి కోసం ఎదురు చూస్తుంటే రైతులకు రైతుబంధు వేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కు రాష్ట్ర ప్రజల పట్ల, రైతుల పట్ల చిత్తశుద్ధి లేదనడానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. కోట్ల రూపాయలు వెచ్చించి అవసరానికి మించిన ఆడంబరాలకు పోతూ ధనిక రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత ఈ ముఖ్యమంత్రి కేసీఆర్ దే. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ని డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల దుర్వినియోగంతో దశాబ్ది ఉత్సవాల పేరుతో టిఆర్ఎస్ నాయకులు అధికారులు ప్రజలు వ్యాపారస్తులపై మూకుమ్మడిగా దాడి చేసి అక్రమ వసూళ్ళు చేస్తుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఓట్ల ద్వారా బుద్ధి చెప్పి ఈ బీఆర్ఎస్ పార్టీని బంగాళాఖాతంలో కలపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

## గల్ఫ్ జెఏసి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చిలుముల రమేష్



కరీంనగర్ జులై 16 (ప్రజామంటలు): దుబాయి, యూఏఈ లో 16 సంవ త్సరాలు పనిచేసిన అనుభవం, అక్కడ మన గల్ఫ్ కార్మికుల కోసం చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి చిలుముల రమేష్ ను గల్ఫ్ జెఏసి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ జెఏసి చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ తెలిపారు. శుక్రవారం (జూన్ 16న) జగిత్యాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ మేరకు రమేష్ కు నియామక పత్రం అందజేశారు. గల్ఫ్ వలస కార్మికుల హక్కులు, సంక్షేమం పట్ల రమేష్ కు ఉన్న నిబద్ధత, నాయకత్వ లక్షణాలను గల్ఫ్ జెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల కొనియాడారు. చిలు ముల రమేష్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రజలు గత యాభై ఏళ్లుగా గల్ఫ్ దేశాలకు ఉద్యోగం, ఉపాధి కోసం వెళుతున్నారని అన్నారు. సురక్షితమైన, చట్టబద్ధమైన వలసల కోసం... అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తామని, హక్కుల కోసం పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి బూత్కురి కాంత, దుబాయిలో ప్రముఖ సోషల్ వర్కర్ ఉట్నూరి రవి, దుబాయి ఎల్లాల శీనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, నరసింహునిపేట సర్పంచ్ బాబు స్వామి, ఇంజపురి తిరుపతి, బడుగు ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారం చేయొద్దు

### ఏ.బి.వి.పి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య




హుస్నాబాద్ జూన్ 16 (ప్రజామంటలు): ఏబివిపి హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో శుక్ర వారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్, పుస్తకాలు అమ్ముతూ విద్యను వ్యాపారం చేస్తున్న మొంటిస్సోరి ( కృష్ణవేణి టాలెంట్) స్కూల్ యొక్క గుర్తింపు రద్దు చేయాలని అలాగే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించగా స్థానిక ఎంఈఓ స్పందించి అధికారులతో సీజ్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య మాట్లాడుతూ.... పట్టణంలోని అన్ని ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలో లాభార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభించిన అధికారులు ప్రవేటు కార్పొరేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రవేటు కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను వ్యాపారం చేస్తున్న అధికారులు స్పందించకపోవడం బాధాకరం అన్నారు. ఇకనైనా ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కంసాని రాకేష్, ఉపాధ్యక్షులు భీమగోని చరణ్, సోషల్ మీడియా కన్వీనర్ చేయని మణిదీప్, కోహెడ వికాస్, ఇలియాస్ పాల్గొన్నారు.

## లియాపి సౌత్ సెంట్రల్ జోన్ కమిటీ మెంబర్లుగా జగిత్యాల వాసులు




జగిత్యాల జూన్ 16 (ప్రజామంటలు): భారతీయ జీవిత భీమా ఏజెంట్ల సమాఖ్య సౌత్ సెంట్రల్ స్థాయి జోనల్ ప్లానింగ్ కమిటీ సభ్యులుగా జగిత్యాల నుండి నల్ల సత్తయ్య, యం. సత్యనారాయణ రెడ్డిలు ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల లియాపి జగిత్యాల కార్యవర్గం శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని లియాపి జగిత్యాల అధ్యక్షులు ఏ. వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి పాదం ఐలయ్య, కోశాధికారి జున్ను మల్లయ్య లతో పాటు ఏజెంట్ల బృందం వీరిద్దరినీ అభినందించారు. భారతీయ జీవిత భీమా సంస్థను కాపాడేందుకు, ఏజెంట్ల సమస్యలను తీర్చేందుకు జాతీయ స్థాయిలో కృషి చేయాలని వారిని కోరారు. ఈసందర్భంగా ఎన్నికైన నల్ల సత్తయ్య, యం. సత్యనారాయణ రెడ్డి లు మాట్లాడుతూ వారి ఎన్నికకు సహకరించిన లియాపి జగిత్యాల బృందానికి, కరీంనగర్ డివిజన్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏజెంట్ల సమాఖ్య నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంస్థ అభివృద్ధికి, ఏజెంట్ల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## దశాబ్ది ఉత్సవాల్లో పట్టణ ప్రగతి ..సర్వాంగ సుందరంగా జనగామ



జనగామ జూన్ 16 (ప్రజామంటలు):తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జనగామ పట్టణంలోని వైష్ణవి గార్డెన్లో తెలంగాణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిసిపి సీతారామ్, పురపాలక సంఘం చైర్మన్ పోకల జమున హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ దశాబ్ది ఉత్సవాల్లో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల అభివృద్ధికి గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తూ అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చిన్న పురపాలక సంఘాలను ఏర్పాటు చేసి సేవలను వేగవంతం చేస్తుందని తద్వారా అభివృద్ధి గణనీయంగా పెరి గిందని అన్నారు.జనగామ పట్టణంలో గతంలో చూసుకుంటే అనేక ఇబ్బందులు ఉండేవని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టణాల, గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధా న్యత కల్పిస్తున్నారని గుర్తు చేశారు.జనగామ పట్టణంలో 10 ఎకరాల స్థలంలో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని నగరంలో ఉన్న గూడ్స్ లోడింగ్ అన్ లోడింగ్ షెడ్డును యశ్వంతపూర్ కు తరలించేందుకు అధికారులతో మాట్లాడి అవసరం అయితే ఢిల్లీకి వెళ్లి మాట్లాడి గూడ్స్ షెడ్యూలు తరలిస్తానని అన్నారు. జనగామ పట్టణంలో 7 కోట్ల 50 లక్షల బ్యాంకు లింక్ కేజీలు స్వయం సహాయక బృందాలకు, 63 లక్షల బ్యాంకు రుణాలు వీధి వ్యాపారులకు మంజూరు చేసి చెక్కు అందజే శారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేసి ర్యాలీగా మున్సిపల్ సిబ్బందితో కలిసి వైష్ణవి గార్డెన్ కు వెళ్లారు. ఉత్తమ సేవలు అందించిన మున్సిపల్ కార్మికులను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ రజిత పట్టణ ప్రగతి నివేదిక ను చదివి వినిపించారు. మున్సిపల్ ప్రగతి నివేదికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ చంద్రమౌళి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాంప్రసాద్, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు కార్మికులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శ

### రూ. 5000 సహాయం అందించిన మంజులరెడ్డి



చిగురుమామిడి జూన్ 16 (ప్రజామంటలు): సైదాపూర్ మండలం పెర్కపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కానుగంటి వసంత అనారోగ్యంతో భాధపడుతూ మరణించిన విషయం గ్రామస్తులు సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి కి తెలపగా, వారి కుటుంబ సభ్యులుని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంజుల రెడ్డి మాట్లాడుతూ.... కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటానని హామీ ఇస్తూ, వారి కుటుంబ సభ్యులకి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు.. కష్టంలో సహాయం అడిగిన వెంటనే స్పందించి, అండగా నిలిచినా మంజులరెడ్డి కి గ్రామస్తులు, యువత కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట బోల్ల శ్రీహరి, బోల్ల శంకరయ్య, పోతరాజు నరేష్, బుచ్చయ్య, పోతరాజు శ్రీనివాస్, పిల్లి తిరుపతి, బోల్ల తిరుమల్, చింతం రాజేష్, కానుగంటి శ్రీకాంత్, తమ్మినేట్టి మల్లయ్య, పోతరాజు శ్రీనివాస్ తదితరులున్నారు.

## ముద్ర లోన్ లబ్ధిదారులతో ప్రకాశ్ జవదేకర్ భేటి

### నిరుద్యోగుల సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కు కేంద్రం చేయూత

### కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్



సికింద్రాబాద్ జూన్ 16 (ప్రజామంటలు): మహా జన సంపర్క్ అభియాన్ లో భాగంగా బన్సీలాల్ పేట డివిజన్ భోలక్ పూర్ లో శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్ పర్యటించారు. ముద్ర లోన్లు తీసుకొని వెల్డింగ్ షాపులు నడుపుతున్న లబ్ధిదారులతో ఇంటరాక్ట్ అయ్యారు. వెల్డింగ్ షాపుల నిర్వహణ, వ్యాపార తీరుతెన్నులు, తదితర విషయాలను అడిగి తెలుసుకొన్నారు. ముద్ర లోన్లతో స్వయం ఉపాధి పొందుతున్న వారిని అభినందించారు. మిగితా వారికి కూడ ముద్ర లోన్ల పథకం గురించి తెలిపి, వారికి ఉపాధి లభించేలా ప్రయత్నం చేయాలని, ముద్ర లోన్ల మంజూరీకి తాము సిద్దంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. తమకు ఒక్కోక్కరికి రూ 10 లక్షల చొప్పున ముద్ర రుణాలు మంజూరైనట్లు లబ్ధిదారులు త్రిశూల్ గుప్తా, రమేశ్ గుప్తా, భవాని శ్రీనివాస్ లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, సికింద్రాబాద్ మహంకాళి బీజేపీ జిల్లా ప్రెసిడెంట్ శ్యాంసుందర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, పార్లమెంట్ కో ఆర్డినేటర్ టి.రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు శివరామకృష్ణ, సురేశ్, వై. శ్రీనివాస్, అమర్ నాథ్, కుర్మ శంకర్, సదానందం, గుంటి సత్యనారాయణ, లక్ష్మన్, దిలారి లక్ష్మీ పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతిని బహిష్కరించిన కాంగ్రెస్ కౌన్సిలర్లు



జనగామ జూన్ 16 (ప్రజామంటలు): ఎం.పి. కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కార్యక్రమానికి పిలవకుండా ప్రొటో కాల్ పాటించకపోవడంతో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని జనగామ మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు బహిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవ కార్యక్రమంలో ప్రొటో కాల్ పాటించలేదని నిరసన వ్యక్తం చేశారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భువనగిరి ఎం.పి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించకపోవడం ప్రొటోకాల్ ను ఉల్లంఘించడమేనని, మున్సిపల్ అధికారులు పాలకవర్గం విస్మరించడం శోచనీయమని కౌన్సిలర్లు ఆరోపించారు.

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా చెక్కును అందజేసిన జడ్పిటిసి రవి



భీమదేవరపల్లి జూన్ 16 (ప్రజామంటలు): మండలంలోని ముస్తఫా పూర్ గ్రామంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో దావూరి జయ గత సంవత్సరం రూ.లు 21,803 పాలసీ తీసుకున్నది. తీసుకున్న ఆరు నెలలకు ఆమె మరణించింది. నాచురల్ డెత్ క్లైమ్ చేయగా రూ.లు 4,03,500 భీమా చెక్కును నామిని దావూరి వెంకటేష్ కు జడ్పిటిసి వంగ రవి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ, ప్రతి మనిషికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ అవసరమని, ప్రమాదాలు పెరుగుతున్నందున కుటుంబ భద్రత కోసం అందరికి ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రొంటాల ప్రభాకర్, ఉప సర్పంచ్ రజనాచారి, మాజీ సర్పంచ్ కదారి మంజుల, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజీఎం అట్లా సురేష్, వరంగల్ బ్రాంచ్ మేనేజర్ బండి వినయ్, సేల్స్ మేనేజర్ వడ్డేపల్లి సురేష్ కుమార్, డెవలప్మెంట్ ఆఫీసర్ విజయ్ కుమార్, సేల్స్ ఆఫీసర్స్ గొట్టే కోటి, ఏల్ది రాజు, బొడిగె శ్రీనివాస్, పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వొడితల





భీమదేవరపల్లి జూన్ 16 (ప్రజామంటలు): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ రేణికుంట్ల భాగ్య భర్త చంద్రయ్య ఉరి వేసుకొని చనిపోగా వొడితల సతీష్ కుమార్ వారి కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం భీమదేవరపల్లి మండలం వైస్ ఎంపీపీ మాడుగుల ఎజ్రా తల్లి వారం రోజుల క్రితం మరణించగా అక్కడికి వెళ్లి నివాళులర్పించారు. వారి వెంట టీఆర్ఎస్ మండల అధ్యక్షులు మార్పాటి మహేందర్ రెడ్డి, ఎంపీపీ జక్కుల అనిత రమేష్ యాదవ్, జడ్పిటిసి వంగ రవీందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు గూడెల్లి రాజిరెడ్డి, కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, భీమదేవరపల్లి గ్రామ ఎంపీటీసీ సాతూరి రమ, యాటపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక, రాజకీయ అసమానతలను రూపుమాపి

# సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ



జనగామ జూన్ 16 (ప్రజామంటలు): సమాజంలో ఉన్న సామాజిక రాజకీయ అసమానతలను రూపుమాపి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని, గత 28 ఏళ్లుగా జాతి కోసం పోరాడుతూనే సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పాలకులపై యుద్ధం చేస్తూనే తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నదని, ఈ మహోత్తర ఉద్యమంలో జాతి మొత్తం మమేకమై, విద్యార్థి యువ తరమే జాతిని ముందుకు నడపాలని ఎం.ఆర్. పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ సంస్థాగత ఉద్యమ పునర్నిర్మాణంలో భాగంగా స్టేషన్ ఘన్పూర్ మండల పరిధిలోని మీదికొండ, శివునిపల్లి, నమిలిగొండ, ఇప్పగూడెం తదితర గ్రామాల్లో మాదిగల చైతన్య సమావేశాలు నిర్వహించారు. ఈ చైతన్య సభలకు ముఖ్య అతిథిగా హాజరైన రాగల్ల ఉపెందర్ మాదిగ మాట్లాడుతూ.... 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ఫలాలు మన వర్గాలకు అందకుండా చేస్తున్న పాలకుల కుట్రలను పసిగట్టి మాదిగ జాతిని ఏకం చేసి విద్యార్థి యువతరమే జాతి ఉద్యమ సైనికులుగా మారి హక్కుల కోసం ఉద్యమించాలని అన్నారు. మాదిగ జాతి 28 సంవత్సరాలుగా రాజీలేని పోరాటం కొనసాగిస్తున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం, ప్రతిపక్షాలకు నిజాయితీ లేకపోవడం వల్లనే సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని మండిపడ్డారు. విద్యా, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో న్యాయబద్ధమైన వాటా మాదిగ, మాదిగ ఉపకులాలకు దక్కాలంటే ఏబిసిడి వర్గీకరణ జరగాల్సిందేనని బిజెపి ఇచ్చిన మాటకు కట్టుబడి రానున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత సామాజిక, రాజకీయ అంశాలకు అనుగుణంగా ఉద్యమాన్ని నిర్మాణం చేస్తూ శాస్త్రీయంగా, సైద్ధాంతికంగా, నిర్మాణాత్మకంగా బలోపేతమై పాలకులపై యుద్ధం తీవ్రతరం చేసేలా శ్రమించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాలను కలుపుకొని పోరాటాన్ని ఉధృతం చేసేందుకు జూలై చివరి వారంలో ప్రపంచం మొత్తం మాదిగల వైపు చూసేలా భారీ బహిరంగ సభ హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నామని, 28 ఏండ్ల మాదిగ మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్షను సాకారం చేసుకునేందుకు జాతి సిద్ధం కావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ను సంస్థాగతంగా బలోపేతం చేసుకుని మాదిగల శక్తిని మరోసారి రుచి చూయించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎం.ఎస్.పి. హన్మకొండ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ మాదిగ, జిల్లా నాయకులు నలిమెల నాగరాజు మాదిగ, మండల సీనియర్ నాయకులు గాదె శ్రీదర్ మాదిగ, గుర్రం నవీన్ మాదిగ, గాదె అశోక్ మాదిగ, కొట్టే కళ్యాణ్ మాదిగ, కొడిశల రామ్ మాదిగ, గుర్రం వాసు మాదిగ, గాదె నరేష్ మాదిగ, అఖిల్ మాదిగ, ప్రణయ్ మాదిగ, కలకొల అనిల్ మాదిగ, ఐత అజయ్ మాదిగ, బాంకురి ఆదిత్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతి దినోత్సవం పాల్గొన్న ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు



కోరుట్ల టౌన్ జూన్ 16 (ప్రజామంటలు): తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రోజున పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించ వలసినదిగా ప్రభుత్వం ఆదేశించి నందున అట్టి ఆదేశాల మేరకు ఈ రోజు కోరుట్ల మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా అంబేద్కర్ చౌరాస్తా నుండి డప్పు చప్పుల్లు, కళాకారుల నృత్యాలతో ప్రత్యేకంగా అలంకరించిన మున్సిపల్ వాహనాలు మరియు సిబ్బంది జాతీయ పతాకాన్ని పట్టుకొని జీఎస్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. తదుపరి జీఎస్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిధి గా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొని మాట్లాడుతూ.... తెలంగాణ ఏర్పడిన 9 సం"లు పూర్తి చేసుకున్నందున ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గత వారం రోజులుగా ఈ ఉత్సవాలు జరుపుకొంటునామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ నేత్రుత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఎటువంటి లోటు లేకుండా అభివృద్ధి చేసి చూపించారని నాటి ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని కానీ నేటి తెలంగాణ రాష్ట్రం అన్ని పథకాలలో దేశం గర్వించే స్థాయిలో ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి గురించి నాడు నేడు రూపంలో చిత్రించిన వీడియో ను తిలకించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య మాట్లాడుతూ గడచిన 9 సం"లలో మన కోరుట్ల పట్టణం చాలా అభివృద్ధి చెందినది అని అందుకు మనకు నిదర్శనం పారిశుధ్యం, హరిత హారం లో రెండు అవార్డులు రావడం అని తెలిపారు. ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధికి పెద్ద మనసుతో సహకరించిన ఎమ్మెల్యే విద్యా సాగర్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ప్రశంసా పత్రం తో పాటుగా జ్ఞాపిక ను అందించారు. “సఫాయి అన్న నీకు సలాం అన్న” అనే వేదికగా పారిశుధ్య కార్మికులకు పిపిఈ కిట్ లు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, పట్టణ అధ్యక్షులు అన్నం అనిల్ మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, డిప్యూటీ ఈఈ అభినయ్ టిపిఓ ప్రవీణ్ ఏఈ లక్ష్మి, మేనేజర్ సిహెచ్. శ్రీనివాస్, ఆర్ఓ బి. తిరుపతి వార్డ్ కౌన్సిలర్స్ మరియు కో ఆప్షన్ మెంబెర్స్, ఆఫీస్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు, కళాకారుల బృందం సభ్యులు, అందరూ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ కు సిపిఎం వినతి



జనగామ జూన్ 16 (ప్రజామంటలు): బచ్చన్నపట మండలం చిన్నరాం చర్ల రెవెన్యూ సర్వే నెంబర్ 174 లో ప్రభుత్వ భూమి విస్తీర్ణం 8 ఎకరాల 23 గుంటల భూమిని స్టేటస్ కో ఆర్డర్ పేరుతో భూకబ్జాదారులు అక్రమంగా ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ రోహిత్ సింగ్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు మాట్లాడుతూ జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను ప్రభుత్వమే కాపాడాలని కోరారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ భూమి ప్రభుత్వానిది అని హెచ్చరిక బోర్డులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారని కానీ భూమిని మాత్రం స్వాధీనం చేసుకోకుండా భూకబ్జాదారులైన బచ్చన్నపేట జడ్పిటిసి జడ్పీ వైస్ చైర్మన్ భర్త గిరబోయిన అంజయ్య తన రాజకీయ పలుకుబడితో ఈ భూమిని ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని ఇట్టి భూమి విషయంలో గత ప్రభుత్వం గిరబోయిన అంజయ్యకు భూమి అసైన్డ్ చేయలేదని గతంలో కొంతమంది పేద రైతులకు అసైన్డ్ చేయగా వారి నుండి ప్రభు త్వం ఫారం-1, ఫారం-2, స్వాధీనం చేసుకుందని కానీ తప్పుడు పద్ధతులలో గిరబోయిన అంజయ్య ఇతరులు భూమిని ఆక్రమంచుకొని సాగు చేసుకుంటున్నారు. ఈ భూమి విషయంలో ఆర్.డి.ఓ. కోర్టులో భూకబ్జాదారులు అసైన్డ్ పట్టా చేయాలని దరఖాస్తు చేసుకోగా వీరి దరఖాస్తులను రద్దు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్, బెల్లంకొండ వెంకటేష్, పార్టీ నాయకులు దూసరి నాగరాజు అజ్మీర సురేష్ నాయక్ తేజావత్ గణేష్ నాయక్, పర్వతం నరసింహులు, పర్వతం యాదగిరి, కడకంచి బాలరాజు, తూర్పాటి యాదగిరి, కడకంచి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకు ప్రభుత్వం చేయూతనివ్వాలి



- నటి ప్రియాంక చౌదరి
- సికింద్రాబాద్ లో వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శన షురూ

సికింద్రాబాద్ జూన్ 16 (ప్రజామంటలు): భారతీయ సంస్కృతి లో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, చేనేత మనుగడకు, అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని టాలీవుడ్ నటి ప్రియాంక చౌదరి అన్నారు. సికింద్రాబాద్ జవహర్ నగర్ కాలనీ లోని సింధీకాలనీ రోడ్డు లో గల ఆర్య వైశ్య అభ్యుదయ సంఘం హాలులో ఏర్పాటైన కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శనను ప్రియాంక చౌదరి శుక్రవారం నాడు ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటుచేసిన చేనేత కారుల వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, వాటి తయారీ గురించి ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.... చేనేత వస్త్రాలపై నేటికి ఆదరణ తగ్గలేదని, నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. డిజైనర్లు సైతం దేశంలో చేనేత కారులు నేస్తున్న ఈ హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను సృజనాత్మకంగా డిజైన్ చేస్తున్నారని ఆమె అన్నారు. కాగా ఈ హ్యాండ్ లుమ్ ఉత్పత్తుల తయారీకి చేనేత కారులు శ్రమ ఎంతో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ను ఆదరించాలని,అప్పుడే చేనేత కారుల కష్టానికి తగ్గ ఫలితం పరోక్షంగా ఇవ్వగలమన్నారు. నిర్వాహకులు యలమంచిలి శ్రీలత మాట్లాడుతూ.... ఈ నెల 25వ తేది వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుండి చేనేత కారులు , చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

## గురుకుల ఉపాధ్యాయ పోటీ పరీక్ష కొరకు ఉచిత శిక్షణ

జగిత్యాల జూన్ 16 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖా బీ.సి. స్టడీ సెంటర్, జగిత్యాల ఆధ్వర్యంలో గురుకుల ఉపాధ్యాయ పరీక్ష మరియు సాధారణ పోటీ పరిక్షలకు కొరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగ తుల అభివృద్ధి శాఖ అధి.కారి సాయి బాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కొరకు అర్హులైన బిసి,ఎస్సి,ఎస్టి లకు చెందిన జగి త్యాల జిల్లాకు చెందిన యువతి యువకుల నుండి ఆఫ్ లైన్ ద్వారా తేది : 17-06-2023. నుండి 21-06-2023 నేరు గా బీ.సి.స్టడీ సెంటర్, జగిత్యాల లేదా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో అప్లికేషన్స్ చేసుకోవాలని సూచిం చారు. శిక్షణను పొందగోరే అభ్యర్థులు ఈ దిగువ సూచించిన అర్హతలు కలిగి ఉండవలెను. 1) గురుకులం పరీక్షకు సంబంధించి నియమాలకు అనుగుణముగా అభ్యర్ధుల విద్యార్హతలు ఉండాలి. 2) ప్రస్తుతం విద్యను అబ్యాసిస్తున్న అభ్యర్థులు మరియు ఏదైన ప్రభుత్వ ఉద్యోగం లో ఉన్న వారు బి.సి స్టడీ సర్కిల్ లో ఉచిత శిక్షణ కు అర్హులు కారు.3) గురుకులం ఉచిత శిక్షణ జగిత్యాల నందు నిర్వహించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకోసం ఫోన్ నెంబర్ : 9603681993, 9441460325 మరియు బీ.సి. స్టడీ సెంటర్, జగిత్యాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## ఎన్ఎస్వి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

### సంప్రదించడానికి సెల్ నెంబర్: 9491165294

జగిత్యాల జూన్ 16 (ప్రజామంటలు): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ ఉద్యోగాలను అందించాలనే లక్ష్యంతో భారత దేశంలోనే ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంక్ ఐసిఐసిఐ ఆదికృత రిక్రూట్మెంట్ ఏజెన్సీ ఐటీఎం వారి ఆధ్వర్యంలో 26 సంవత్సరాల లోపు వయస్సు ఉండి ఏదైనా డిగ్రీ 2020, 21, 22, 23 సంవత్సరంలో పూర్తి చేసిన యువతి యువకులకు ఐసిఐసిఐ బ్యాంక్ వివిధ ఉద్యోగాల కోసం జాబ్ మేళాను 19-06-2023 సోమవారం ఉదయం 10 గంటలనుండి ఎన్ఎస్వి డిగ్రీ అండ్ పీజీ కళాశాల పాత బస్టాండ్ నందు నిర్వహించబడును ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యువతి యువకులు ఇట్టి సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగమేలలో పాల్గొన్న విద్యార్థులు విధిగా వారి సర్టిఫికెట్స్ అన్ని జిరాక్స్ కాపీలతో పాటుగా బయోడేటా ఫామ్ మరియు ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోను తీసుకొని రాగలరు అని ఎన్ఎస్వి డిగ్రీ కళాశాలల చైర్మన్ యాద రామకృష్ణ అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేష్ ప్రిన్సిపల్ గోపు మునీందర్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకై నేరుగా ఎన్ఎస్వి డిగ్రీ కళాశాలలో గాని లేదా మా సెల్ నెంబర్ 9491165294 నందు సంప్రదించగలరు.

## రెడ్డి సంఘం నుండి రూ. 5000 అందజేత



చిగురుమామిడి జూన్ 16 (ప్రజామంటలు): చిగురుమామిడి మండలం ఇందుర్తి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సంఘం సభ్యులు గునుకుల కమలాకర్ రెడ్డి తండ్రి మృతి చెందగా శుక్రవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షులు గాదే రఘునాథ్ రెడ్డి కాంతాల శ్రీనివాస్ రెడ్డి కొమ్మెర మహేందర్ రెడ్డి సభ్యులతో కలిసి 5,000 రూపాయలను అధ్యక్షుడు గాదే రఘునాథ్ రెడ్డి కమలాకర్ రెడ్డి కి అందజేశారు. ఇందుర్తి రెడ్డి సంక్షేమ సంఘంలోని సభ్యుల కుటుంబ సభ్యులు ఎవరు చనిపోయిన దహన ఖర్చులకు 5000 రూపాయలను రెడ్డి సంఘం నుండి ఇవ్వడం జరుగుతుందని అందులో భాగంగానే అందజేశామని రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఇందుర్తి గ్రామ మాజీ సర్పంచ్ గునుకుల ఎల్లారెడ్డి ( 90 ) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా వారి స్వగృహం గునుకులపల్లిలో ఉదయం నిర్వహించిన అంత్యక్రియలకు పెద్ద ఎత్తున బంధు మిత్రులతోపాటు చుట్టుపక్కల తదితర గ్రామాల నుండి ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కొత్తకొండ వీరన్న హుండీ లెక్కింపు



భీమదేవరపల్లి జూన్ 16 (ప్రజామంటలు): ప్రసిద్ధి గాంచిన కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కరెన్సీ 4,24,335/- రూ.లు, కాయిన్స్ 21,342 రూ.లు మొత్తం రూ.లు 4,45,677 హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారు తెలిపారు. వీటితో పాటు 23 విదేశీ కరెన్సీ నోట్లు లభించినవి. ఈ కార్యక్రమంలో వరంగల్ డివిజన్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి, కార్య నిర్వాహణాధికారి కిషన్ రావు, దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎల్తూరి ప్రభాకర్, కొక్కుల ఓదెలు, కొత్తకొండ సర్పంచ్ దూడల ప్రమీల సంపత్, ఎంపీటీసీ యాటపోలు రాజమణి శ్రీనివాస్, సరస్వతి సేవా సమితి కొత్తకొండ సభ్యులు, వేములవాడ రాజ రాజేశ్వర సేవా సమితి వరంగల్ సభ్యులు, ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు సదానందం, రాంబాబు, అర్చకులు శ్రీకాంత్, రమేష్, శరత్ చంద్ర, శివకుమార్, సిబ్బంది రామకృష్ణ రావు, రవీందర్, సందీప్ శ్రీధర్, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ది రామయ్య దిష్టిబొమ్మ దహనం

**చేసిన భారత్ సురక్ష సమితి నాయకులు**



జగిత్యాల జూన్ 16 (ప్రజామంటలు): కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెల కూడా గడవకముందే తన హిందూ వ్యతిరేక చర్యలతో మెజార్టీ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని భారత్ సురక్ష సమితి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహశీల్ చౌరస్తాలో భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధి రామయ్య దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా భారత్ సురక్ష సమితి నాయకులు ఎంసి ఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం మాట్లాడుతూ.... ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు స్వాతంత్ర వీర సావర్కర్, ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గే వార్ల జీవిత చరిత్రలను పాఠ్యాంశాల నుండి తొలగించాలని నిర్ణయించడమే కాకుండా గత ప్రభుత్వం అమలు చేసిన మత మార్పిడి వ్యతిరేక చట్టాన్ని కూడా తొలగిస్తున్నట్లు ప్రకటించడం మెజారిటీ ప్రజల మనోభావాలను దెబ్బతీయటమే నన్నారు. అధికారం కోసం పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ లాంటి శత్రు దేశాలతో సైతం చేతులు కలిపే కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని దేశ ప్రజలు గమనించాలని కోరారు. ఇలాంటి విధానాలే కొనసాగిస్తే భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసిచఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కశినాథం ,నరెందుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వేముల పోచమల్లు, బొందుకూరి శ్రీనివాస్, కౌడు వెంకటి, బడే శంకర్, మదిశెట్టి మల్లేశం, లక్ష్మరెడ్డి, శీల గంగారం, ప్రసాద్ రావు, కొత్తకొండ బాలన్న, తునికి అంజన్న, మహేష్ సంపత్ రావు, చందా సుగుణాకర్ రావు, బండి సత్యనారాయణ, గణపతి నరేందర్ రాజు, జిట్టవేని అరుణ్ కుమార్ , రాములు, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రునికి హుండీల బహుకరణ



భీమదేవరపల్లి జూన్ 16 (ప్రజామంటలు): ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం కు హనుమకొండకు చెందిన కీ.శే నూక వీరయ్య - శివలక్ష్మి, చేర్యాలకు చెందిన వనపర్తి సాహితీ - హరీష్ దంపతులు, వనపర్తి స్పందన - నితీష్ దంపతులు స్వామి వారికి రూ.లు 1,65,000/- విలువ చేసిన 3 నూతన హుండీలు బహుకరించారు. హుండీలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ గూడూరు సంజీవరెడ్డి సమక్షంలో సీలు వేసి భక్తులకు అందుబాటులో ఉంచారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, అభివృద్ధి కమిటీ సభ్యులు ఏల్పూరి ప్రభాకర్, కొక్కుల ఓదెలు, యాటపోలు శ్రీనివాస్, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్డి ఐక్య కార్యాచరణ సమావేశాన్ని విజయవంతం చేయండి

**భీమదేవరపల్లి మండల రెడ్డి సంఘాల నాయకులు**




భీమదేవరపల్లి జూన్ 16 (ప్రజామంటలు): భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి బాంధవులు ఈనెల 18 న, ముల్కనూర్ ఎస్.ఆర్.కె. స్కూల్లో నిర్వహించే సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని రెడ్డి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని వారు తెలిపారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, రమణారెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



**జగిత్యాల పట్టణ టి.ఆర్. నగర్ లో శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివా జీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని శివాజీ యూత్ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.**

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

**స్వామిని దర్శించుకున్న శర్వానంద్ దంపతులు**

తిరుమలలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. వీకెండ్ కావడంతో తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. నేడు (శుక్రవారం) క్యూ కాంప్లెక్స్ లోని కంపార్టుమెంట్లన్నీ క్యూలైన్లు వెలుపలికి వచ్చాయి. శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్ లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. గురువారం 70,896 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 4.07 కోట్ల రూపాయలు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. స్వామివారికి 37,546 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామి వారిని హీరో శర్వానంద్ దంపతులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఊరూరు కదలాలి




జనగామ జూన్ 16 (ప్రజామంటలు): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్న పాలకుల కన్నులు తెరిపించే విధంగా హైదరాబాద్ కేంద్రంగా లక్షలాది మందితో మాదిగ జాతి ప్రభంజనాన్ని చూపెడతామని, ఉద్యమం ప్రస్తుతం కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో గ్రామాలను దండోరోద్యమ కేంద్రాలుగా మార్చి మాదిగ జాతి శక్తిని చాటుకోవాలని ఊరూరు కదిలేలా మరో పోరాటానికి సన్నద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి, ఎం.ఎస్.ఎఫ్. అనుబంధ సంఘాల జనగామ నియోజకవర్గ సమావేశం ఎం.ఎస్. పి జనగామ మండల ఇంచార్జి నిర్మాల భాస్కర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పైస రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ...."ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కోసం మాదిగ జాతి చేస్తున్న ఉద్యమం ప్రస్తుతం చాలా కీలక దశకు చేరిందని అన్నారు. పాలకులకు నిజాయితీ, చిత్తశుద్ధి, ఇచ్చిన మాటకు కట్టుబడే నైజం లేకపోవడం వల్లనే వర్గీకరణ బిల్లు ఆలస్యం అవుతుందని అన్నారు. వర్గీకరణ ఉద్యమం దక్షిణ భారతదేశం మొత్తం బలంగా విస్తరించిందని, ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దాటివేసి ముందుకు వెళ్లే పరిస్థితి పాలకులకు కనపడడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అంశమే రాజకీయ ఎజెండగా ఉంటుందని తెలంగాణలో అత్యధిక జనాభా గలిగిన మాదిగలకే రాజకీయాలను శాసించే సత్తా ఉన్నదని, ఈసమయంలో జాతి భవిష్యత్తు కోసం ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా ఊరూరా మాదిగలంతా ఏకమై ఉద్యమం వైపు కదలాలని అన్నారు. పోరాటంలో వీరులుగా ముందుకు సాగుతున్న మాదిగ బిడ్డలు రాజకీయ శక్తిగా ఎదగడానికి చైతన్యం పెంచుకోవాలని జాతిలో ఓటు చైతన్యం తేవాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ తక్షణమే పార్లమెంట్ లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అంత్యోదయ స్ఫూర్తి మా విధానమని గొప్పలు చెప్పే బిజెపి సంపూర్ణ మెజార్టీ ఉండి కూడా వర్గీకరణ బిల్లు పెట్టకుండా అన్యాయం చూస్తుందని, బిజెపి అన్యాయం చేస్తుంటే, రాజకీయ పక్షాలు మౌనం వహిస్తున్నాయని మండిపడ్డారు. మాదిగ జాతి సామాజికంగా రాజకీయంగా ఐక్యతతో ఉండాలని అన్నారు. చివరి దశలో ఉన్న వర్గీకరణ అంశాన్ని సాధించుకునేందుకు రాజకీయాల కతీతంగా దేశానికి మాదిగల ప్రభంజనాన్ని మరొక్కసారి రుచి చూపించాలని కోరారు. అందుకు జాతి ఉద్యమాన్ని పునర్నిర్మించుకోని నిర్మాణాత్మకంగా బలపడాలని కోరారు. జాతిని విచ్ఛిన్నం చేసే పాలకుల కుట్రలకు మాదిగలు బలి కావద్దని, ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు సొంత రాజకీయ అస్థిత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో జరుగుతున్న పోరాటానికి మాదిగలంతా అండగా నిలబడాలని అన్నారు. తర్వాత నియోజకవర్గ పరిధిలో ఉన్న 8 మండలాల నాయకులు, కార్యకర్తలతో మండలాల వారీగా ఉద్యమ నిర్మాణంపై సమీక్ష చేసుకొని, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను వివరిస్తూ, నాయకుల కర్తవ్యాన్ని బోధిస్తూ, కృష్ణ మాదిగ ఆదేశాలను వివరిస్తూ, అందరూ పనిలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా కోకన్వీనర్ ఇనుముల అనిల్ మాదిగ ఎం.ఎస్.పి. జిల్లా నాయకులు గువ్వల రవి మాదిగ ఎమ్మెస్పీ బచ్చన్నపేట మండల ఇన్చార్జ్ అల్వాల నర్సింగరావు మాదిగ సీనియర్ నాయకులు పాకాల కుమారస్వామి మాదిగ బచ్చన్నపేట మండల ఎం ఎస్ పి కో ఇన్చార్జ్ అల్వాల రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు కంతి రాము మాదిగ చెల్లపురం శ్రీకాంత్ మాదిగ కలక్కుంట్ల ప్రణయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చేతి వృత్తి వారలకు రూ. లక్ష పథకం

- **దరఖాస్తుల గడువు పొడిగించాలి**



జగిత్యాల జూన్ 16 (ప్రజామంటలు): ప్రభుత్వం బీసీ కులాల్లో చేతి వృత్తుల వారి సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 100% మాఫీతో రూ. లక్ష ఆర్థిక సహాయం పథకం దరఖాస్తుల గడువును మరో నెల రోజులు పొడిగించాలని జగిత్యాల జిల్లా బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు జరిగిన పట్టణ బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నందున దరఖాస్తుల గడువును పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 4వ తారీకు న పథకం ప్రకటించగా ఆన్లైన్లో దరఖాస్తులు 6వ తేది నుండి స్వీకరించడం ప్రారంభించారు. దరఖాస్తుదారులు 8వ తేదీ నుంచి మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవడం ప్రారంభమైంది. ఐతే 10న రెండవ శనివారం, 11 ఆదివారం రెండు రోజులు సెలవు దినాలు కావడంతో దరఖాస్తులు కుప్పలు తిప్పలుగా వచ్చిపడ్డాయి దీనికి తోడు సర్వర్ ఉదయం 9:30 కు ప్రారంభమై రాత్రి 7 గంటల వరకు వేయడంతో సమయాభావం వల్ల ఆన్లైన్ దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయలేకపోయారు. దీనితో తాసిల్దార్ కార్యాలయాలన్నీ దరఖాస్తుదారులతో నిండిపోయాయి. దానికి తోడు ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరా అధికారులను కార్యక్రమాలకు పురమాయించడంతో ఏకకాలంలో రెండు పనులు చేయడం కష్టతరం అవడంతో ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యంఏర్పడింది. దీనితో చాలామంది దరఖాస్తుదారులు వారి పత్రాలు తాసిల్దార్ కార్యాలయాల్లో మీసేవ కేంద్రాల్లో కుప్పలు తిప్పలుగా పడి ఉన్నాయి. కావున పై సమస్యలన్నిటిని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుదారులకు మరికొంత సమయం కేటాయించి దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మరియు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చింతల గంగాధర్, రాష్ట్ర సంయుక్త కార్య నిర్వాహక కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మూలం రాజ్యాంగం



- **డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్**

ధర్మపురి జూన్ 16 (ప్రజామంటలు): ఉద్యమాలు పోరాటాలు ఎన్ని చేసినా, భారత రత్న డాక్టర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఆర్టికల్ 3 ద్వారానే చిన్న రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సాధ్యం అయిందని జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురి క్షేత్రంలో నూతనంగా ఏర్పాటు చేసి, ఆవిష్కరింప బడిన డాక్టర్ బి.ఆర్ అంబెడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గురువారం మాజీ జెడ్పీ చైర్మన్, జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని అంబెద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురిలో నూతనంగా అంబెద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, అంబెద్కర్ దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు ఆరాధ్య దైవం వంటి వారన్నారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అందరినీ సమానంగా చూడవలసిన బాధ్యత మంత్రి కొప్పుల ఈశ్వర్ గారి పైన ఉందని, ధర్మపురి లో ఉన్న దళితులకు ఎటువంటి కష్టం వచ్చిన ముందుండి నిలబడే రాజమల్లయ్యతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని అనుకున్నామని, కానీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కేవలం వారి పార్టీకి సంబందించిన నాయకులను మాత్రమే పక్కన పెట్టుకొని విగ్రహావిష్కరణ చెయ్యడం చాలా బాధాకరమన్నారు. ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యం అయింది అంటే అది కేవలం అంబెద్కర్ గారు రచించిన రాజ్యాంగం వల్లనేనని, అంబెద్కర్ గారి కార్యక్రమంలో వారి పాటలు పెట్టాలి తప్ప ఒక నాయకుని పాటలు పెట్టి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నారని, మంత్రి ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, మహనీయుడు అంబెద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అభిప్రాయాన్ని తెలియజేస్తున్నాం తప్ప మరో ఉద్దేశం ఏమి లేదని, త్వరలోనే బాబు జగ్జీవన్ రావు విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసి స్థానిక దళిత పెద్దలతో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగన బట్ల దినేష్, బ్లాక్ కాంగ్రెస్ ఎంపిటిసి కుంట సుధాకర్, ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, దళిత సంఘాల పెద్దలు రాజమల్లయ్య, ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల ఎం.ఆర్.పి.ఎస్. అధ్యక్షులు రవి ,ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పురుషోత్తం, టౌన్ యూత్ అధ్యక్షులు అప్పం తిరుపతి, మండల బి.సి. సెల్ అధ్యక్షులు మల్లేష్, కట్ట భువనేశ్వర్, మల్లేష్, శ్రవణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో పట్టణ ప్రగతి కార్యక్రమం

- **మున్సిపల్ పారిశుధ్య కార్యాలయ సిబ్బందిని సన్మానించిన**
- **ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా**





జగిత్యాల జూన్ 16 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణంలో శుభమస్తు గార్డెన్స్ టౌన్ హాల్ లో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొని మున్సిపల్ పారిశుధ్య మరియు కార్యాలయ సిబ్బందిని సన్మానించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభి వృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు. జగిత్యాల పట్టణానికి ప్రజల అంచనాలకు మించి నిదులు ఖర్చు చేశాం. జగిత్యాల పట్టణానికి గతంలో 5 కోట్లు తెస్తే గోడలపై రాసిన చరిత్ర చూశాం. నేడు ప్రజల గుండెల్లో తెలంగాణ పథకాలు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.... సంజయ్ నిరంతర శ్రమ ఫలితం గానే టౌన్ హాల్ నిర్మాణంలో గత అధికారుల తప్పుడు ప్లాన్ వల్ల నిరుపయోగంగా మారింది. కవిత, సంజయ్ కృషి టౌన్ హాల్ ఆధునీకరణ. జగిత్యాల జిల్లా గా చేయటం వల్ల ప్రజలకు మరింత మెరుగైన సేవలు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజలు, యువకులు, మహిళలు అందరూ సహకరించాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన నిధుల మంజూరులో మొండి చెయ్యి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ డా. నరేష్, డిఈ రాజేశ్వర్, ఏఇ శ్రీనివాస్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పాల్గొన్నారు.



## ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు న్యాయవాది పుప్పాల లింబాద్రి**




జగిత్యాలజూన్ 16 (ప్రజా మంటలు) జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లింబాద్రి మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని అన్నా రు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 9 సంవత్సరాలు గడుస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక నిరాశలో నిరుద్యోగులు ఉన్నారని మరియు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ డబ్బులు బెడ్ రూములు కట్టిస్తామని చెప్పిన ఇప్పటిదాకా ఇండ్లు అందరికీ ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. నీళ్లు, నియామకాలు, నిధులు పేరట టిఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు పెరిగినాయని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో వెల్గటూరు మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఏర్పాటు చేసి సొంత లాభం కొరకు ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారని దాదా పు ఆరు గ్రామాల ప్రజలు రెండు నెలల నుండి ఫ్యాక్టరీ వద్దని ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఈరోజు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.ఆరు గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్న శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి బహుజన సమాజ్ పార్టీ అండగా ఉంటుందని డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మద్దెల నారాయణ, జిల్లా మైనార్టీ సెల్ ఇంచార్జి మహమ్మద్ ముజాహిద్, జిల్లా నాయకులు సంపత్, లక్ష్మణ్ రాథోడ్, శ్రీధర్, ప్రశాంత్, విజయ్, ప్రవీణ్, లింగం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన జడ్పీ చైర్మన్



మహాదేవపూర్ జూన్ 16 (ప్రజామంటలు): మహాదేవపూర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధిలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్ పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ కుదురుపల్లి గ్రామానికి చెందిన జి. కృష్ణయ్య కు 20,000 రూపాయలు, పోచమ్మ కు 16000 వేల రూపాయలు, సుశీలకు 8500 రూపాయలు చెక్కులను పంపిణీ చేశారు. కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు మహా దేవ పూర్ సర్పంచ్ శ్రీపతి బాపు పిఎసిఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, బిఆర్ఎస్ పార్టీ పలిమెల మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, మండల యూత్ అధ్యక్షులు అలీమ్ ఖాన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదానికి గురైన వ్యక్తి కుటుంబానికి జయశంకర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



మహాదేవపూర్ జూన్ 16 (ప్రజామంటలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ గ్రామానికి చెందిన కడార్ల నాగరాజ్ ఇటీవల బైకు ప్రమాదానికి గురికావడంతో తలకు తీవ్ర గాయం కాగా హనుమకొండలోని ప్రైవేటు హాస్పిటల్ కి తీసుకు వెళ్లడం జరిగింది ప్రమాదానికి గురైన నాగరాజుకి భార్య ఇద్దరు పిల్లలు నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా ఉండడం వలన పరిస్థితి అర్థం చేసుకొని వారి కుటుంబానికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలీ మారుతి 10,000 ఆర్థిక సహాయం చేశారు. జిల్లా ఇంచార్జ్ సంబరాతి పోశన్న, అశోక్, బొగ్గుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన బిల్లా యాదగిరి

## ప్రతి పేద కుటుంబానికి ఒక అన్నలా నిలబడుతా



వేలేరు జూన్ 16 (ప్రజామంటలు): వేలేరు గ్రామానికి చెందిన కనకం మల్లయ్య ఇటీవల మరణించగా వారి మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఒక అన్నలా నిలబడుతా అని వారిని ఎల్లవేళలా ఆపదలో ఉంటే అదుకుంటా అని ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి 50 కేజీల రైస్ బ్యాగ్ ను మాజీ కూడా డైరెక్టర్, బిఆర్ఎస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ బిల్లా యాదగిరి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజయ్య, చంద్రమౌళి, అనిల్, మహిపాల్, శ్రీనివాస్, మల్లయ్య, పెరుమయ్య, శ్రీకాంత్, రాజయ్య, బాల కొమురయ్య పాల్గొన్నారు.

## యూపిలో దారుణ ఘటన

### భార్యన్ గన్‌తో కాల్చి..అదే బుల్లెట్‌కు భర్త బలి

లక్నో,జూన్16 : భార్యను గన్‌తో కాల్చి భర్త హత్య చేశాడు. అయితే అదే బుల్లెట్ తగిలి అతడు కూడా మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 40 ఏళ్ల అనేక్ పాల్, 38 ఏళ్ల సుమన్ పాల్ భార్యాభర్తలు. చండీగఢ్‌లో రోజువారీ కూలీగా పనిచేసిన వారిద్దరూ ఇటీవల స్వస్థలమైన కాన్పూర్ గ్రామానికి తిరిగి వచ్చారు. అయితే భార్యాభర్తలిద్దరూ తరచుగా గొడవ పడేవారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న అర్ధరాత్రి వేళ అనేక్ పాల్ పూజలు చేశాడు. ఆ తర్వాత భార్య సుమన్‌ను కౌగిలించుకుని ఆమె వెనుక నుంచి తుపాకీతో కాల్పులు జరిపాడు. అయితే ఆ బుల్లెట్ అనేక్ పాల్ శరీరం నుంచి కూడా దూసుకెళ్లింది. గాయపడిన భార్యాభర్తలను బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. వారిద్దరూ చనిపోయారు. ఒక కుమార్తె, ముగ్గురు కుమారులైన వారి నలుగురు పిల్లలు అనాథలయ్యారు. ఈ సంఘటనపై బంధువుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. గత వారం ఒక పెళ్లి వేడుకలో భార్య సుమన్ మొబైల్ చోరీ అయ్యిందని చెప్పారు. నాటి నుంచి భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరుగుతున్నట్లు బంధువుల ద్వారా తెలిసిందన్నారు. అయితే భార్యను చంపేందుకు నాటు తుపాకీని భర్త ఎలా కలిగి ఉన్నాడు? అర్ధరాత్రి వేళ అతడు ఎందుకు పూజలు చేశాడు? అన్నదానిపై దర్యాప్తు జరుపుతామని పోలీస్ అధికారి తెలిపారు. అనాథలైన నలుగురు పిల్లలను తమకు అప్పగించమని అమ్మ తరుపు కుటుంబం వారు కోరుతున్నట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం వ్యవహరించి దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామని పోలీస్ అధికారి వెల్లడించారు.

## ఆపరేషన్ సక్సెస్..పేషెండ్ డైడ్

### చితాభస్మంలో దొరికిన సర్జికల్ కత్తెర్లు

### ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

జైపూర్,జూన్16 : గుండె సర్జరీ చేసిన డాక్టర్లు శరీరంలోనే సర్జికల్ కత్తుల్ని వదిలివేసినట్లు రాజస్థాన్‌కు చెందిన కుటుంబం ఆరోపించింది. జైపూర్‌లోని ఫోర్టిస్ హాస్పిటల్ నిర్లక్ష్యం వల్లే తమ తండ్రి చనిపోయినట్లు ఓ వ్యక్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాడు. ఆపరేషన్ తర్వాత తన తండ్రి ఆరోగ్యం క్షీణించిందని, సర్జరీ జరిగిన 12 రోజుల తర్వాత అతను చనిపోయాడని, దహనం తర్వాత చితాభస్మం కోసం శ్మశానవాటి కకు వెళ్తే ఆ ప్రాంతంలో సర్జికల్ కత్తులు దొరికినట్లు ఆ వ్యక్తి ఆరోపించాడు. ఆ కుటుంబం హాస్పిటల్‌కు ఫిర్యాదు చేస్తే వాళ్లు ఆ ఆరోపణలను కొట్టిపారేశారు. జవహార్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఆ ఫ్యామిలీ ఫిర్యాదు చేసింది. నగరంలోని మాన్‌సరోవర్ ఏరియాకు చెందిన కమల్ అనే వ్యక్తి ఈ ఫిర్యాదు ఇచ్చాడు. ఫోర్టిస్ హాస్పిటల్ జోనల్ డైరెక్టర్ నీరవ్ భన్సల్ ఆ ఆరోపణలను కొట్టిపారేశారు. తమ వద్ద సర్జరీ జరిగిన తర్వాత ఎక్స్‌రే రిపోర్టులు ఉన్నాయన్నారు. చనిపోయిన వ్యక్తి శరీరంలో ఎటువంటి సర్జికల్ వస్తువులు లేవన్నారు. అయితే రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రసాది లాల్ మీనా ఆధర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ ఫిర్యాదుపై కమిటీ దర్యాప్తు చేపట్టనున్నది.

## చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు

### వైసిపి ఎంపి ఆర్ కృష్ణయ్య డిమాండ్

న్యూఢిల్లీ,జూన్16 : చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించా లని వైసీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల చిన్నచూపులు చూస్తోందన్నారు. పేరుకు మాత్రమే బీసీ ప్రధాన మంత్రిని చేశారని.. అన్ని రాజకీయ పార్టీలు బీసీల కోసం మద్దతు తెలిపిన కేంద్రం తన వైఖరిని మార్చడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జనాభాపరంగా రిజర్వేషన్లు కల్పించాలని.. 75 కోట్ల మంది బీసీలు అభివృద్ధికి కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు లక్షల కోట్లు బడ్జెట్ బీసీలకు ఇవ్వకపోతే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ధర్నాలు చేస్తామన్నారు. 75 ఏళ్ళుగా భారతదేశంలో అన్ని పదవులు, సంక్షేమ పథకాలు తమరే అనుభవించారని.. బీసీలకు మాత్రం ఏం దక్కడం లేదని విమర్శించారు. బీసీ సంఘాలన్నీ కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల్లో పర్యటించి బీసీలను ఏకం చేస్తామన్నారు. రాజకీయ పార్టీలన్నీ తమ పద్ధతిని మార్చుకోవాలని హితవుపలికారు. పేద కులాల అభివృద్ధి కోసం అందరూ ముందుకు రావాలన్నారు. బీసీల రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ పార్టీ మల్లికార్జున ఖర్గే మద్దతు ఇచ్చారని ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

ప్రొఫెసర్ హరగోపాల్‌పై దేశ ద్రోహం కేసు

## కేంద్రం తీరుపై మండిపడ్డ నారాయణ

న్యూఢిల్లీ,జూన్16 : ప్రొఫెసర్ హరగోపాల్‌పై దేశ ద్రోహం కేసు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని సిపిఐ నేత నారాయణ తీవ్రంగా ఖండించారు. హరగోపాల్ ఒక ప్రొఫెసర్ ఆయనకు ఎవరితో సంబంధాలు లేవని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. హరగోపాల్‌పై కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వ్యక్తి హరగోపాల్ అని అన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ జోక్యం చేసుకొని హరగోపాల్‌పై ఎలాంటి కేసు లేకుండా చూడాలన్నారు. లేకుంటే కేసీఆర్‌ను ఉద్యమ ద్రోహిగా చూడాల్సి ఉంటుందన్నారు. వరవరరావుపై కూడా ఇలానే దేశద్రోహం కేసు పెట్టారని.. ఆయనను జైల్లో వేశారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే బీహార్‌లో జరిగే విపక్షాల మీటింగ్ కేసీఆర్, జగన్, చంద్రబాబు నాయుడు హాజరుకావాలన్నారు. గవర్నర్ తమిళ్ సై సౌందర్ రాజన్ పుదుచ్చేరిలో మహిళలకు పబ్బులకు పర్మిషన్ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానం రాలేదని గవర్నర్ అన్నారని.. మరి పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదు అంటే గవర్నర్ దగ్గర సమాధానం లేదన్నారు.

# ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలి

### టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి



మెట్ పల్లి జూన్ 16 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ ను జారీ చేయాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెట్ పల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ, డిఈడీ, టిటిసి కోర్సులను పూర్తిచేసిన అభ్యర్థులు సంవత్సరాల తరబడి ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం జారీ అయ్యే డీఎస్సీ నోటిఫికేషన్ కో సం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారనీ అన్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చి 9సంవత్సరాలు దాటిపోతున్నా ఉద్యోగాల నియామక ప్రక్రియను చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారనీ, తక్షణమే ఉద్యోగ నియామకాల భర్తీపై తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ ను జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడంతో లక్షలాది మంది విద్యావంతులైన నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . రేషనలైజేషన్ పేరుతో ఉన్న పాఠశాలలను మూసివేస్తూ నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందనీ, తక్షణమే పాఠశాలల మూసివేతను ఉపసంహరించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపున బీఈడీ, డీఈడీ, టిటిసి కోర్సులను పూర్తి చేసిన విద్యావంతులైన నిరుద్యోగ యువత ఉద్యోగాలు రాక రోడ్లపై తిరుగుతూంటే, మరొక వైపున పాఠశాలల్లో టీచర్లు లేక విద్యార్థులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో సాంఘిక సంక్షేమ, గిరిజన విద్యాశాఖ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని లేకపోతే విద్యార్థి, నిరుద్యోగ యువత మద్దతును కూడగట్టి టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# బాసర ట్రిపుల్ ఐటిలో అంతుచిక్కని సమస్యలు

### గతేడాది సమస్యల కోసం విద్యార్థుల ఆందోళన

### ఇప్పడేమో కలకలం రేపుతున్న వరుస ఆత్మహత్యలు

### ఆందోళనలపై పట్టింపులేని ఐకెఆర్

నిర్మల్,జూన్16 : బాసర ట్రిపుల్ ఐటి సంస్థలో సమస్యలు ఇప్పుడే కొత్తేమీ కాదు. గతంలోనూ విద్యార్థులు ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి. బాసరలో ఐఐటి ఏర్పాటు బదులు ట్రిపుల్ ఐటి ఏర్పాటు చేసినా అక్కడ పూర్తిస్థాయి సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. ఈ విషయంలో స్థానిక మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కూడా ఏనాడూ చొరవ చూపలేదు. ఆయన ఇప్పటికే సమస్యను తెలుసుకుని ఉంటే తాజా పరిణామాలు జరిగి ఉండేవి కావు. ఇకపోతే సమస్యలను పరిష్కరించాలంటూ నిర్మల్ బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు గతేడాది అనేక ఆందోళనలు నిర్వహించారు. తదుపరి మంత్రికెటిఆర్ వెళ్లి వారితో చర్చించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంతో పాటు జీవిత లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాల్సిన వారు ఆందోళనలతో సమయం వృథా చేసుకోవాల్సి వస్తోంది. గత ఏడాది ఇదే జూన్ నెలలో విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఆందోళన చేశారు. వారం రోజుల పాటు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరసనల్లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా రాహుల్‌గాంధీ వంటి దేశ ప్రముఖులను తమ ఆందోళనతో ఆకర్షించారు. మూడు నెలల పాటు యూనివర్సిటీలో పలుదఫాలుగా విద్యార్థులు ఆందోళన లతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాత వచ్చిన అధి కారులు యూనివర్సిటీ నియమ నిబంధనలు అంటూ కఠినంగా అమలు చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి తోడు 15 మంది రిటైర్డు ఆర్మీ అధి కారులను నియమించుకొని పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. విద్యార్థులు తరగతి గదిలో లేదంటే భోజనశాలకు లేదంటే హాస్టల్ గదుల్లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. నలుగురు కలిసి మాట్లాడిన విచారణ ఎదుర్కొవాల్సిన పరిస్థితులు ఏర్పడినట్లు విద్యార్థు లు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల ఫోన్‌లు తీసుకొని తనిఖీ లు కూడా చేపడుతున్నారు. చిన్న తప్పిదాలకు కూడా సంజాయిషీ లెటర్ రాయించు కుంటూ ఆందోళనకు గురిచేస్తున్నారు. ఇందుకు ఉదా హరణనే వేసవి సెలవులకు హాస్టల్‌గదుల్లో సామాగ్రి ఉంచి వెళితే తిరిగి తీసుకోవడానికి సంజాయిషీ లెటర్‌లు రాయించుకునే వారు అధికారులు తిరిగి ఇవ్వలేదు. గత ఏడాది విద్యార్థులు ఆందోళన చేసినందుకో ఏమో గాని క్రమశిక్షణ చర్యలంటూ వారిపై కఠినంగా వ్యవహరిస్తు న్నారు. ఇలాంటి పరిస్థితులు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంతో పోటీ మధ్య ఎన్నో ఆశలతో ప్రవేశం పొందిన విద్యార్థులు. అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. తాజాగా రెండు రోజుల వ్యవధిలో దీపిక, లిఖిత అనే విద్యార్థినులు మృతి చెందడం కలకలరేపుతోంది. రాష్ట్రంలో ఉన్న ఏకైక ఈ యూనివర్సిటీలో లోపాలే విద్యార్థులకు శాపాలుగా మారుతు న్నాయి. 9 వేల మంది విద్యార్థులున్న ఈ క్యాంపస్‌లో వసతుల లేమితో పాటు ఇతర పరిపాలనా లోపాలు, సమస్యలు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. 9వేల మంది విద్యార్థులుండే రెసిడెన్షియల్ క్యాంపస్‌లో హాస్టల్ భవనాల గేట్ల వద్ద సెక్యూరిటీ గార్డుల ను నియమించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. బుధవారం రాత్రి మొదటి సంవత్సరం విద్యార్థి లిఖిత హాస్టల్ భవనం నాల్గవ అంతస్థు నుంచి పడి ఆత్మహత్య చేసుకున్నట్లు మొదట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత అధికారులు ఇది ఆత్మహత్య కాదని, ప్రమాదవశాత్తు జరిగిందని వివరించడం సందేహాలకు కారణమైంది. విద్యార్థిని పరీక్షల కోసం యూట్యూబ్‌లో పాఠాలు వింటుండగా కుక్కలు తరిమాయని.. దీంతో ఆమె నాల్గవ అంతస్థు పైకెక్కి జారి పడిందని, ఇది కేవలం ప్రమాదవశాత్తు మాత్రమే జరిగిందంటూ సెలవిచ్చారు. ఈ ఉదంతంపై భిన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. అధికారుల ఒత్తిడి మేరకే విద్యార్థిని కుటుంబ సభ్యులు ఈ సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందంటూ చెబుతున్నారని పలు రాజకీయ పార్టీలు,విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. 8 నెలల క్రిందట బానుప్రసాద్ అనే విద్యార్థి హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటే దుర్వాసన వచ్చే వరకు ఎవరూ కనిపెట్టలేదంటే హాస్టళ్లలో ఎలాంటి పరిస్థితి నెలకొందో అర్థమవుతుంది.9 వేల మంది విద్యార్థులకు రెగ్యులర్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు, గెస్ట్‌ఫ్యాకల్టీ కలిపి సుమారు 250 మంది మాత్రమే అధ్యాపకులు ఉన్నారు. మరో 200ల అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తొమ్మిదేళ్ల నుంచి భర్తీకి నోచుకోవడం లేదు. ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగింది. బోధనతో పాటు అదనపు బాధ్యతలు అప్పజెబుతున్నారు. దీంతో ఆదరా బాదరగా సిలబస్ పూర్తి చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుంది. చదువులో వెనుక బడుతున్నామనే కారణాలతో కొంత మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా దీపిక అనే విద్యార్థి మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడి మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. సాధారణంగా మెడికల్ ఆత్యవసరం ఏర్పడితే ఎవరైనా దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తీసుకెళతారో. కాని బాసర ట్రిపుల్ ఐటీ అధికారుల తీరే వేరు. ఆత్మహత్య యత్నాలు, ప్రమాదాలు చోటుచేసుకుంటే కొన ఊపిరితో ఉన్న విద్యార్థులను 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న నిజామాబాద్‌కు కాకుండా 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్మల్‌కు తీసుకెళుతున్నారు. సరైన సమయానికి వైద్యచికిత్స అందక విద్యార్థులు మధ్యలోనే ప్రాణాలు వదులుతున్నారు. పొరుగున ఉన్న నిజామాబాద్‌లో పెద్ద మెడికల్ కాలేజ్ ఉన్నప్పటికి అధికారులు వినియోగించుకోలేక పోతున్నారు.

గత ఏడాది నుంచి ఇలా ముగ్గురు విద్యార్థులు సరైన సమయానికి వైద్య సేవలు అందక నిర్మల్‌కు తీసుకెళుతూ మార్గమధ్యలో ప్రాణాలు వదిలారు. విద్యార్థులు మృతి చెందితే ఎప్పుడు లేని విధంగా ఈ సారి యూనివర్సిటీ అధి కారులు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ట్రిపుల్ ఐటీలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అయితే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థుల ఆందోళన చేస్తున్నారు. బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు గత ఏడాది కెటిఆర్ ప్రకటించారు. అయినా ఎందుకనో సమస్యలు తీరడం లేదు.

## మాయం కానున్న నెహ్రూ మ్యూజియం

- ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ సొసైటీ గా మార్పు
- కేంద్రం నిర్ణయం తీసుకుందన్న వార్తలపై భగ్గుమన్న జైరామ్ రమేశ్



న్యూఢిల్లీ,జూన్16 : నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ పేరును ప్రధాన మంత్రుల మ్యూజియం మరియు సమాజంగా మార్చబోతున్నట్లు వార్తలు రావడంతో కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభద్రతాభావంతో అణగారిపోతున్న సూక్ష్మజీవి అని మండిపడింది. కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ శుక్రవారం ఇచ్చిన ట్వీట్‌లో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనేక అభద్రతలతో క్రుంగిపోతున్న సూక్ష్మజీవి అని ఆరోపించారు. మన దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూకు పేరు, ప్రతిష్ఠలు, గొప్ప వారసత్వం ఉన్నాయని చెప్పారు. ఆయన భారత దేశ రూపశిల్పి అని తెలిపారు. ఆయనను గుర్తు చేసుకుంటూ మ్యూజియం అండ్ లైబ్రరీకి ఆయన పేరును పెట్టినట్లు తెలిపారు. చిల్లరతనం, కక్షసాధింపు, నీ పేరు మోదీ. 59ఏళ్లకుపైగా పుస్తక భాండాగారంగా, ఆర్కైవ్స్ ఖజానాగా, గ్లోబల్ ఇంటలెక్చువల్ ల్యాండ్‌మార్క్‌గా ఎన్ఎంఎంఎల్ నిలిచింది. దీనిని ఇకపై ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ సొసైటీ అని పిలుస్తారు. భారత దేశ రూపశిల్పి పేరు, ఔన్నత్యాలను చెరిపేయడానికి, చులకన చేయడానికి, నాశనం చేయడానికి మోదీ చేయని పని అంటూ ఏదీ లేదని జైరామ్ రమేశ్ ఆరోపించారు. అభద్రతాభావంతో క్రుంగిపోతున్న సూక్ష్మ జీవి స్వయం ప్రకటిత విశ్వగురువు అని మోదీని జైరామ్ రమేశ్ దుయ్యబట్టారు. జైరామ్ రమేశ్ తాను నెహ్రూవాదినని చెప్పుకుంటారు.నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ సమావేశం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గురువారం జరిగినట్లు జాతీయ మీడియా కథనాలనుబట్టి తెలుస్తోంది. ఈ సమావేశంలో దీని పేరును ప్రధానమంత్రుల మ్యూజియం అండ్ సొసైటీగా మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఎన్ఎంఎంఎల్ సొసైటీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షుడు, రాజ్‌నాథ్ సింగ్ ఉపాధ్యక్షుడు. కేంద్ర మంత్రులు అమిత్ షా, అనురాగ్ ఠాకూర్, ధర్మేంద్ర ప్రధాన్, జీ కిషన్ రెడ్డి, నిర్మల సీతారామన్ తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఢిల్లీలోని తీన్ మూర్తి క్యాంపస్‌లో ఎన్ఎంఎంఎల్ ఉంది. ఇక్కడ ఆధునిక, సమకాలిక భారత దేశంపై పరిశోధనలు జరుగుతాయి. 1964 నవంబరు 14న అప్పటి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దీనిని ప్రారంభించారు.

# రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో స్వచ్ఛ బడి

### రూ. 71 కోట్లతో ఏర్పాటుకు నిర్ణయం

### తడి,పొడిచెత్తను వేరు చేసే కార్యక్రమం

### పట్టణప్రగతి కార్యక్రమంలో మంత్రి కెటిఆర్



హైదరాబాద్,జూన్16: రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో రూ. 71 కోట్లతో స్వచ్ఛ బడిని ప్రవేశపెడుతున్నట్లు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. స్వచ్ఛ బడి ద్వారా తడి, పొడి, హానికర చెత్త వేరుచేసే విధానం, కంపోస్టు ఎరువు తయారీ చేసే విధానంపై యువతకు అవగాహన కార్యక్రమాలు చేపడుతామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా హైదరాబాద్ శిల్పాకళావేదికలో నిర్వహించిన పట్టణ ప్రగతి వేడుకలకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని కేటీఆర్ తెలిపారు. టీఎస్ఐపాస్ తరహాలో టీఎస్ బీపాస్‌ను తీసుకొచ్చాం. స్వీయ ధ్రువీకరణతో భవన నిర్మాణానికి అవకాశం ఇచ్చాం. 9 ఏండ్లలోనే సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధి సాధించాం. దేశంలోనే ఇవాళ బెంగళూరును పక్కన పెట్టేసి.. ఐటీ రంగంలో హైదరాబాద్ ముందంజలో ఉంది. ఐటీ ఎగుమతులు పెరుగుతున్నాయి. ఏక కాలంలో పల్లె ప్రగతి, పట్టణాల ప్రగతి కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి సాధించాయని కేటీఆర్ తెలిపారు.జీహెచ్ఎంసీ పరిధిలో 150 వార్డు కార్యాలయాలను ఒకేరోజు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ఇవి తప్పకుండా విజయవంతం అవుతాయి. గ్రేటర్ పరిధిలో పని చేసే ప్రతి ఉన్నతాధికారి చిత్తశుద్ధితో, పట్టుదలతో పని చేస్తున్నారు. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అనే నానుడి నిజం చేయబోతున్నాం. ఇప్పటికే ఆ నానుడి అమలవుతోంది. రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలను కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. భారతదేశంలోని ప్రతి మున్సిపాలిటీ అధికారులు హైదరాబాద్‌కు తప్పకుండా వచ్చి మన వార్డు కార్యాలయాలను ప్రశంసిస్తారనే నమ్మకం ఉంది. పాఠశాలలను బలోపేతం చేసుకుంటున్నాం. మౌలిక వసతులు పెంచుకుంటున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. టీఎస్ బీపాస్ చట్టం గురించి విని తమిళనాడు సీఎం ఆశ్చర్యపోయారని కేటీఆర్ గుర్తు చేశారు. దీన్ని తాము కూడా అమలు చేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. 9 ఏండ్ల కాలంలో ఒక మున్సిపల్ మంత్రిగా, మా అధికారులు కానీ మేం ఎక్కడా కూడా దిక్కుమాలిన పనులు చేయలేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. అవినీతి రహితంగా పాలన కొనసాగిస్తున్నాం. కేసీఆర్ నాయకత్వంలో పరిశ్రమలకు, భవన నిర్మాణాలకు స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే అన్ని రంగాల్లో పురోగమనంలో ఉన్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.ఇక్కడితోనే సంతోషపడిపోవద్దు.. మనం సాధించాల్సింది ఇంకా ఉంది అని కేటీఆర్ పేర్కొన్నారు. రజనీకాంత్ హైదరాబాద్ అభివృద్ధిని మెచ్చుకున్నారు. ఆయన వందల దేశాలు తిరిగిన వ్యక్తి. ఆయన వచ్చి హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలకు వెళ్తే ఇది న్యూయార్క్‌లా అనిపించిందన్నారు. ఇది మా ఎస్ఆర్‌డీపీ అధికారులు, ఇంజినీర్ల గొప్పతనం. కరోనా కాలంలో అందరూ తమపనులు వదిలి వెళ్లిపోతే.. మా అధికారులు, ఇంజినీర్లు హైదరాబాద్ నగరంలో రాత్రింబవళ్లు పని చేసి రోడ్లను, ÷÷–ల ఓవర్లను శరవేగంగా నిర్మించారు. వారికి అభినందనలు. కార్మికుల్లో ధైర్యం నింపి, వారిలో విశ్వాసం నింపి పని కల్పించారు మన అధికారులు అని కేటీఆర్ కొనియాడారు. హైదరాబాద్ నగరంలో 22 వేల మంది శానిటేషన్ సిబ్బంది పని చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. కరోనా సమయంలో బయటకు వచ్చి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచారు. వారికి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. భారతదేశంలో అత్యధిక వేతనం అందుకున్న సఫాయి కార్మికులు మన దగ్గరే ఉన్నారు. సఫాయి కార్మికులకు ప్రజలు సహకారం అందించాలని కేటీఆర్ కోరారు.

## తెలంగాణలో కేసీఆర్‌కు నూకలు చెల్లాయి

కలిగించేందుకే కాంగ్రెస్‌లో నేతలు చేరుతున్నారని అన్నారు. ఈ చేరికలు గాలివాటం చేరికలు కాదు. ఈ చేరికలు తెలంగాణలో కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణ కోసమేనని అన్నారు. ఈ చేరికలు తెలంగాణ ప్రజల చైతన్యానికి ప్రతీక. తెలంగాణ దారిదోపిడీ దొంగలు హరీష్, కేటీఆర్. కేసీఆర్ పుట్టకపోయుంటే తెలంగాణ వచ్చేది కాదని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ పుట్టకముందే తెలంగాణ ఉద్యమం పుట్టింది. పాలమూరు బిడ్డ చిన్నారెడ్డి ఆనాడు ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఎలక్షన్లు, కలెక్షన్ల కోసమే 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టారు. 22 ఏళ్లు జెండా మోసిన గంగాపురం రాజేందర్‌కు న్యాయం జరిగిందా? దోపిడీదారులను పొలిమేరలు దాటే వరకు తరమాలి. ఆ బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుంది. నల్లమల అడవుల్లో అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని రేవంత్ కోరారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ ఉద్యమమే లేదన్న కేటీఆర్ వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి ఘాటు కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ పుట్టకపోతే రాష్ట్రం వచ్చేది కాదని కేటీఆర్ అన్నారని.. కానీ ఆయన పుట్టకముందే తెలంగాణ ఉద్యమం పుట్టిందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. పాలమూరు బిడ్డ చిన్నారెడ్డి అప్పట్లో ఉద్యమం నడిపారని తెలిపారు. ఎలక్షన్లు, కలెక్షన్ల కోసమే 2001లో ముఖ్యమంత్రి పార్టీ పెట్టారని విమర్శించారు. గాంధీ భవన్ లో అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది గంగాపురం రాజేందర్, మాజీ జడ్పీటీసీ భీముడు నాయక్, అచ్చంపేట, చారగొండ మండలాల కార్యకర్తలు గాంధీభవన్‌లో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణను పాలించే అర్హత లేదని స్పష్టం చేశారు. దోపిడీకి 4 కోట్ల మంది ప్రజలు బలి అయ్యారని రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ నుంచి తెలంగాణకు విముక్తి కలిగించేందుకే.. ఈ చేరికలు జరుగుతున్నాయని అన్నారు. ఇవన్నీ కూడా తెలంగాణలో కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణ కోసమేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నీటిగోస తీర్చిన ఘనత పీజేఆర్ అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వందలాది ఐటీ కంపెనీలను నగరానికి తెచ్చింది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రానికి కికేసీఆర్ ఛార్లెస్ శోభరాజ్‌లా, హరీశ్, కేటీఆర్ బిల్లా-రంగాలా తయారయ్యారని విమర్శించారు. పార్టీ కార్యకర్తలంతా.. తెలంగాణ ప్రజల కోసం సమయం కేటాయించాలని అన్నారు.



# గుంటూరు కారంపైనే మహేశ్ ఆశలు

టాలీవుడ్‌లో పక్కా కమర్షియల్ చిత్రాల కు కేరాఫ్ అడ్రెస్ గా నిలుస్తూ.. ఎన్నో హిట్లను ఖాతాలో వేసుకుంటూ దూసుకు పోతోన్నాడు సూపర్ స్టార్ మహేశ్ బాబు. ఇలానే ఆ మధ్య వరుస గా హ్యాట్రిక్ విజయాల ను సొంతం చేసుకున్న అతడు.. గత ఏడాది వచ్చిన 'సర్కారు వారి పాట'తో ఆశించిన సక్సెస్ ను సొంతం చేసుకోలేదు. దీంతో ఈ సారి ఎలాగైనా గట్టిగా కొట్టాలని ఫిక్స్ అయ్యాడు. భారీ హిట్ కొట్టాలన్న కసితో ఉన్న సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రస్తుతం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో కలిసి 'గుంటూరు కారం' అనే సినిమా ను చేస్తున్నాడు. ఫుల్ లెంగ్త్ మాస్ ఎంటర్టైనర్ గా రూపొందుతోన్న ఈ చిత్రం పై అంచనాలు భారీ గా ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే దీన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. దీంతో దీని పై హైప్ బాగా పెరిగిపోతోంది. సక్సెస్ ఫుల్ కాంబో లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న 'గుంటూరు కారం' సినిమా కు సంబంధించిన రెగ్యూలర్ షూటింగ్ చాలా రోజుల క్రితమే ప్రారంభం అయింది. కానీ మధ్యలో కొన్ని ఆటంకాలు ఎదురు కావడంతో చిత్రీకరణ సజావుగా సాగడం లేదు. దీంతో ఈ ఏడాది రిలీజ్ చేస్తారనుకున్న ఈ చిత్రం వచ్చే సంవత్సరం సంక్రాంతికి వాయిదా పడిపోయిన విషయం తెలిసిందే. వాస్తవానికి 'గుంటూరు కారం' మూవీ కి సంబంధించి కొత్త షెడ్యూల్ ను ఈ వారం లో జరపాల ని అనుకున్నారు. కానీ ఆర్టిస్టుల డేట్స్ వర్కౌట్ కాకపోవడంతో దీన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ఇక తాజా సమాచారం ప్రకారం.. ఈ మూవీ కి ఇప్పటి వరకూ జరిగింది కాకుండా.. ఇంకా 78 రోజుల షూటింగ్ బ్యాలెన్స్ ఉందట. ఇదంతా ఏకధాటి గా జరిపేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నట్లు తాజాగా తెలిసింది. బ్యాలెన్స్ ఉన్న 'గుంటూరు కారం' మొత్తం టాకీ పార్టును భారీ షెడ్యూల్ లోనే ఫినీష్ చేయాలని భావిస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లుగానే మహేశ్ కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నాడని టాక్. ఇక ఈ చిత్రాన్ని రాధాకృష్ణ నిర్మిస్తున్నారు.

# కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో చిరు కొత్త సినిమా

మెగాస్టార్ చిరంజీవి తండ్రిగా డిజే టిల్లు ఫేమ్ సిద్దు జొన్నలగడ్డ తనయుడిగా ఒక సినిమా రూపొంద బోతోంది... సోగ్గాడే చిన్ని నాయన ఫేమ్ కళ్యాణ్ కృష్ణ ఆ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నారు అనే వార్తలు జోరుగా వస్తున్నాయి. చిరంజీవి పెద్ద కూతురు సుస్మిత కొణిదెల నిర్మించబోతున్న ఆ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష.. సిద్దుకు జోడీగా శ్రీలీల కనిపించబోతుందనే వార్తలు కూడా వస్తున్నాయి. సినిమా గురించి వస్తున్న వార్తల జోరు చూస్తూ ఉంటే మొదలు అయినట్లుగానే అనిపిస్తుంది. చిరంజీవి ప్రస్తుతం చేస్తున్న భోళా శంకర్ సినిమా విడుదల అవ్వక ముందే ఆ సినిమా అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సమయంలోనే ఈ సినిమా ఒక మలయాళ సినిమాకు రీమేక్ అని కొందరు అంటున్నారు. కొన్ని నెలల క్రితం మలయాళ సినిమా బ్రో డాడీ కి రీమేక్ గా చిరంజీవి సినిమాను చేసే అవకాశాలు ఉన్నాయి అంటూ మీడియా వర్గాల్లో చర్చ జరిగింది. ఇప్పుడు కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో చేయబోతున్న సినిమా రీమేక్ అయ్యి ఉంటుందా లేదా అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం చేస్తున్న భోళా శంకర్ సినిమా తమిళ సినిమాకు రీమేక్ అనే విషయం తెల్సిందే. అందుకే ఇప్పుడు కొత్త కథ తో సినిమా ను చేస్తేనే బాగుంటుందని అంతా భావిస్తున్నారు. కానీ చిరంజీవి.. సిద్దుల సినిమా బ్రో డాడీ కి రీమేక్ అనే పుకార్లు షికార్లు చేస్తున్న నేపథ్యంలో మెగా ఫ్యాన్స్ లో ఒకింత అసంతృప్తి వ్యక్తం అవుతోంది. వాల్తేరు వీరయ్య సినిమా కొత్త కథ తోనే రూపొందించడం జరిగింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది కనుక ముందు ముందు కూడా సొంత కథ లతో సినిమాలను



చిరంజీవి చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. మొత్తానికి చిరు-సిద్దుల సినిమా విషయమై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

# రామాయణ గాథపై పట్టు కోల్పోయిన దర్శకుడు

## తనకు నచ్చిన విధంగా తీర్చిన ఓం రౌత్

రామాయణం ఆదికావ్యం. ఆ కథ యుగయుగాలుగా ఎప్పుడు విన్నా..ఎప్పుడు చిత్రంగా చూసినా తనివితీరదు. అలాంటి కావాల్యన్ని దృశ్యరూపంలోకి తెచ్చేముందు అనేక విధాలుగా తపస్సు చేయాల్సి ఉంటుంది. అయితే ఓం రౌత్ తీసుకుని వచ్చిన ఆదిపురుష్ రామాయణ కథనే అయినా తనకు నచ్చినట్లుగా, మార్పులు చేసి తీయడం వల్ల రామాయణం తెలిసిన సగటు మనిషికి నచ్చకపోవచ్చు. అంతేగాకుండా ఇలా తీసాడేంటన్న బాధా కలగవచ్చు. ఇప్పుడు అదే జరిగింది. ప్రభాస్,కృతి సనన్ జంటగా, దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కించిన 'ఆదిపురుష్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇది రామాయణం ఆధారంగా తీసిన సినిమా అని విడుదలకి ముందు చెప్పాడు. ఈ సినిమాకి ఈమధ్య కాలంలో ఏ సినిమాకి రానంత క్రేజ్ వచ్చింది.గ్రాఫిక్స్ కలబోతలో ఈ సినిమాకి సుమారు రూ. 500 కోట్లు ఖర్చు అయిందని అంచనా. అలాగే ఈ సినిమా విడుదలకి ముందు ఆ చిత్ర నిర్వాహకులు స్వామి హనుమకు ఒక సీట్ ఖాళీగా వుంచుతాము అని కూడా చెప్పారు, అంటే ఈ సినిమాకి చిత్ర నిర్వాహకులు ఎంతలా ప్రమోట్ చేశారో చెప్పొచ్చు. ఈ సినిమా ప్రచార చిత్రం ముందు విడుదల చేసినప్పుడు చాలా విమర్శలు వచ్చాయి. అయితే అందరికీ తెలిసిన కథే అయినందున... సినిమా తీసేముందు ఇదో ఆదికావ్యం అన్న స్పృహను కోల్పోరాదు. అలాగే ఇదో ఇతిహాసం అన్న విషయాన్ని మరువరాదు. రాముడి వనవాసంతో కథ మొదలవుతుంది. వనవాసానికి వెళ్ళినప్పుడు, సీత మాయలేడిని చూసి రాముడికి చెప్తుంది. ఆ తరువాత ఆ మాయలేడిని వెతుక్కుంటూ రాముడు వెళతాడు. ఆ మాయలేడి రాముడు గొంతుతో అరవటం, సీత వెంటనే శేష్ ని కూడా రాముడికి సాయంగా వెళ్ళమంటుంది. శేష్ వెళ్లిన తరువాత రావణుడు సన్యాసి వేషంలో సీత దగ్గరకి భిక్షకి రావటం, సీత బయటకి వచ్చి బిక్ష వేస్తుండగా రావణాసురుడు ఆమెను ఎత్తుకుపోతాడు. రాముడు, శేష్ అది మాయలేడి అని తెలుసుకొని తిరిగి వచ్చిన తరువాత జటాయువు రావణ అని పేరు చెప్పి మరణిస్తుంది. రాముడు అప్పుడు సుగ్రీవుడితో మైత్రి చేసుకొని వానర సైన్యం సహాయం కోరతాడు. అక్కడే హనుమ కూడా కలుస్తాడు. వానర సైన్యంతో రావణుడు మీద యుద్దానికి వెళ్లి రావణుడు ఎత్తుకుపోయిన సీతను తిరిగి రాముడు పొందుతాడు. దర్శకుడు ఓం రౌత్ ఈ 'ఆదిపురుష్' సినిమా చేసినప్పుడు దానిమీద అసలు రీసెర్చ్ చెయ్యలేదని అర్థం అవుతోంది. ఎందుకంటే మొదటి సన్నివేశం




నుండి చివరి వరకు తనకు నచ్చినట్టుగా తన ఊహకు అందినట్టుగా సన్నివేశాలను రూపొందించి తీసుకున్నాడు కానీ, వాల్మీకి రామాయణం కానీ, ఏ ఇతర రామాయణాలు ప్రాతిపదికగ కానీ చూసి తీసినట్టు సినిమాలో ఒక్క సన్నివేశం కూడా కనిపించదు. చాలామంది ప్రజలకు ముఖ్యంగా తెలుగు వారికి రామాయణ, భారత, భాగవతాలు గురించి బాగా తెలుసు. ఇప్పటి యువతకు కూడా అంతోఇంతో ఈ ఇతిహాసాల మీద అవగాహన వుంది. అందుకని సినిమా కోసం కొన్ని సన్నివేశాలు రాసుకున్న మూల కథని మార్చకూడదు, వక్రీకరించకూడదు.

# పుష్ప- 2 సినిమాపై భారీ అంచనాలు

ఇంటర్వెల్ తరవాత ఊహించని ట్విస్ట్ అల్లు అర్జున్.. సుకుమార్ కాంబోలో రూపొందుతున్న పుష్ప 2 సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను దర్శకుడు సుకుమార్ రూపొందిస్తున్నాడు. దాదాపు రెండేళ్ల సమయం తీసుకుని మరీ రూపొందిస్తున్న ఈ సినిమాలోని ప్రతి ఎలిమెంట్ మరియు ప్రతి సీన్ కూడా చాలా స్పెషల్ గా ఉంటుందని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. పుష్ప సినిమాలోని పాత్రలు మరియు సన్నివేశాలు మాస్ ఆడియన్స్ తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అందుకే పుష్ప సినిమా రూ.400 కోట్ల వసూళ్లు చేసింది. ఇప్పుడు



వెయ్యి కోట్ల టార్గెట్‌తో పుష్ప 2 సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. అందుకే పుష్ప 2 సినిమా లోని ప్రతి సన్నివేశాన్ని కూడా అత్యంత జాగ్రత్తలు తీసుకుని రూపొందిస్తున్నారు. అలాంటిది ఇంటర్వెల్ సన్నివేశం ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. సుకుమార్ శిష్యుల నుండి అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా ఇంటర్వెల్ ట్విస్ట్ ను ఏ ఒక్కరు కూడా ఊహించలేరు అంటున్నారు. సినిమా ఇంటర్వెల్ ట్విస్ట్ కు అంతా కూడా షాక్ అవుతారు అంటూ వారు ఆఫ్ ది రికార్డ్ చెబుతున్నారు. రష్మిక మందన్నా పాత్ర కి ఈ ట్విస్ట్ ముడిపడి ఉంటుందని కూడా వారు చెబుతున్నారు. ఇంతకు ఆ ట్విస్ట్ ఏంటి... రష్మిక మందన్నా సెకండ్ పార్ట్ లో మరింత కీలకంగా ఉండబోతుందా అనేది చూడాలి అంటే సినిమా విడుదల అయ్యే వరకు వెయిట్ చేయాల్సిందే. మైత్రి మూవీ మేకర్స్ వారు దాదాపుగా నాలుగు వందల కోట్ల రూపాయల బ్జడెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. మరో వైపు ఈ సినిమా కోసం దేవి శ్రీ ప్రసాద్ అంతకు మించి అన్నట్లుగా సంగీతాన్ని ఇచ్చేందుకు కుస్తీలు పడుతు న్నాడు. మలయాళ నటుడు ఫహద్ ఫాసిల్ ఈ పార్ట్ లో చాలా కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. విడుదల విషయమై దసరా వరకు క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# కోలుకుంటున్న గాయపడ్డ క్రికెటర్లు

## ఆసియా కప్‌కు అందుబాటులోకి బుమ్రా

న్యూఢిల్లీ,జూన్16 టీమ్ఇండియాకు మంచిరోజులు వస్తున్నాయి! గాయాల పాలైన ఆటగాళ్లు వేగంగా కోలుకుంటున్నారు. పేసుగుర్రం జస్ప్రీత్ బుమ్రా, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఆసియాకప్-2023కి అందుబాటులో ఉంటారని తెలిసింది. ఇక ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన రిషభ్ పంత్ తన రికవరీతో బీసీసీఐనే సర్‌ప్రైజ్ చేస్తున్నాడు. మూడు ఫార్మాట్లలో టీమ్ఇండియాకు వెన్నెముకగా మారాడు జస్ప్రీత్ బుమ్రా ఎన్నో మ్యాచులను ఒంటిచేత్తో గెలిపించాడు. వెన్నెముక గాయంతో 2022 సెప్టెంబర్ నుంచి క్రికెట్‌కు దూరమయ్యాడు. దాంతో ఆస్ట్రేలియాలో జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. దాంతో ఏప్రిల్‌లో అతడు న్యూజిలాండ్‌కు వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. సర్జరీ విజయవంతం కావడంతో అతనిప్పుడు వెన్నెముక నొప్పి నుంచి బయటపడ్డాడు. బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ సైతం వెన్ను నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దిగువ వెన్నెముక గాయంతో ఏప్రిల్‌లో క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. దాంతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఆఖరి టెస్టు ఆడలేదు. మే నెలలో లండన్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని ఎన్‌సీఏలో రిహబిలిటేషన్ పొందుతున్నాడు. మొత్తానికి వీరిద్దరినీ సెప్టెంబర్‌లో ఆసియాకప్-2023కి సిద్ధం చేయాలని ఎన్‌సీఏ మేనేజ్‌మెంట్ పట్టుదలగా ఉంది. జస్ప్రీత్ బుమ్రా ప్రస్తుతం ఫిజియో థెరపీ చేయించుకుంటు న్నాడని, కొద్ది కొద్దిగా బౌలింగ్ చేస్తున్నాడని తెలిసింది. మెల్లిమెల్లిగా అతడిపై పనిభారం పెంచుతారు. శ్రేయస్ మాత్రం ఇంకా ఫిజియో థెరపీ ప్రాసెస్‌లోనే ఉన్నాడని అంటున్నారు. అయితే వీరిని నేరుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడించొద్దని విశ్లేషకులు, అభిమానులు భావిస్తున్నారు. మొదట దేశవాళీ క్రికెట్లో ఆడించి ఫిట్‌నెస్ తనిఖీ చేయాలని సూచిస్తున్నారు.మరోవైపు టీమ్ఇండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ అత్యంత వేగంగా కోలుకుంటున్నాడు. తన పాజిటివ్‌నెస్‌తో బీసీసీఐని సర్‌ప్రైజ్ చేస్తున్నాడు. ఎన్‌సీఏ సిబ్బంది అతడిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో పంత్‌ను ఐసీసీ వన్డే ప్రపంచకప్‌నకు సిద్ధం చేయాలని బోర్డు పట్టుదలతో ఉంది. ఘోర రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డ పంత్ ఇప్పుడిప్పుడే నడుస్తున్నాడు. క్రచెస్ లేకుండా మెట్లు ఎక్కుతున్నాడు. ప్రస్తుతానికి అతడికి ఎలాంటి నొప్పి లేదని త్వరలోనే ఫిజియో రజినికాంత్ నేతృత్వంలో ఫిట్‌నెస్ కసరత్తులు మొదలు పెడతాడని తెలిసింది. మరో ఫిజియో థెరపిస్ట్



తులసీరామ్ యువరాజ్ సైతం అతడికి అండగా ఉన్నాడు.

# విరాట్‌దే మొదట తప్పు: నవీన్ ఉల్ హక్

కాబూల్,జూన్16 : ఐపీఎల్‌లో విరాట్ కోహ్లితో లఖ్‌నవూ ఆటగాడు నవీన్ ఉల్ హక్ వివాదం అభిమానులకు గుర్తుండే ఉంటుంది. ఈ ఘటనపై నవీన్ తొలిసారిగా స్పందిస్తూ.. మొదట విరాటే గొడవ ఆరంభించాడని ఆరోపించాడు. 'మ్యాచ్ సమయంలోనూ, ముగిశాక కూడా విరాట్ ప్రవర్తన సరిగా లేదు. నేను గొడవ ఆరంభించలేదు. మ్యాచ్ అయ్యాక షేక్‌హ్యాండ్ ఇచ్చేటప్పుడు తనే నా చేతిని గట్టిగా పట్టుకున్నాడు. అందుకే కోపం వచ్చింది. మాకు పడిన జరిమానాలను గమనిస్తే మీకే అర్థమవుతుంది. అసలు నేనా మ్యాచ్‌లో ఎవరినీ ఒక్క మాట కూడా అనలేదు' అని నవీన్ ఉల్ హక్ స్పష్టం చేశాడు.

# ఈసారి వరల్డ్ కప్ గెలుస్తాం: థీక్షణ

కొలంబో,జూన్16 :1996లో విశ్వవిజేతగా నిలిచిన శ్రీలంక జట్టును స్ఫూర్తిగా తీసుకొని తాము ఈసారి వరల్డ్ కప్ గెలుస్తా మని థీక్షణ అన్నాడు. '1996లో శ్రీలంక జట్టు వరల్డ్ కప్ విజేతగా అవతరిస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ, మా జట్టు కప్పు కొట్టింది. ఈసారి ప్రస్తుత జట్టు వరల్డ్ కప్ గెలవాల్సిన సమయం వచ్చింది' అని థీక్షణ తెలిపాడు. వరల్డ్ కప్ క్వాలిఫై యింగ్‌లో ఆఖరి రెండు స్థానాలు మిగిలా యంతే. ఒకప్పటి



చాంపియన్లు వెస్టిండీస్, శ్రీలంక ఆ రెండు స్థానాలు దక్కించుకునేందుకు పసికూనలతో పోటీ పడుతున్నాయి. జూన్ 18న జింబాబ్వేలో జరగనున్న వరల్డ్ కప్ క్వాలిఫైయర్ మ్యాచులపైనే ఆ శ్రీలంక టీమ్ ఆశలన్నీపెట్టుకుంది. ఈఏడాది వన్డే వరల్డ్ కప్ భారత్‌లో జరగనుంది. 2011లో సొంత గడ్డపై టీమిండియా వరల్డ్ కప్ ట్రోఫీని దక్కించుకుంది. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో ఎస్.ధోనీ (91 నాటౌట్ 79 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) సిక్స్ కొట్టడంతో భారత జట్టు చాంపియన్‌గా అవతరించింది.ఐపీఎల్ 16వ సీజన్‌లో థీక్షణ సంచలన బౌలింగ్ ప్రదర్శన చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడిన ఈ యంగ్‌స్టర్ 9 మ్యాచుల్లో 12 వికెట్లు తీశాడు. క్వాలిఫైయర్ 1 పోరులో అతడు డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌పై 3 వికెట్లతో మెరిశాడు. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠ రేపిన ఫైనల్లో రవీంద్ర జడేజా(11 నాటౌట్) చెన్నైని గెలిపించాడు. మోహిత్ శర్మ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి చెన్నైకి కప్పు అందించాడు. దాంతో, ధోనీ సేన ఐదోసారి ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకుంది.

# సైక్లింగ్ వీరుడి తుదిశ్వాస

## రేసులో మరో సైక్లిస్ట్‌ను ఢీకొని మృత్యువాత



న్యూఢిల్లీ,జూన్16 : సైక్లింగ్ అంటే అతడికి ప్రాణంతో సమానం. కొండ ప్రాంతాల గుండా సాగే ఈ పోటీల్లో ఇప్పటికే ఎన్నోసార్లు గెలిచి పేరు తెచ్చుకున్నాడు. అదే ఉత్సాహంతో రేస్‌కు వచ్చాడు. మరికాసేపట్లో ఫినిషింగ్ లైన్‌ను దాటుతాను అనుకున్న అతడిని ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాద సంఘటన స్విట్జర్లా ండ్‌లో జరిగింది. ఆ దేశానికి చెందిన 26 ఏళ్ల సైక్లిస్ట్ గినో మడెర్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. టూర్ దే సుసే ఐదో రౌండ్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న గినోకు అదే ఆఖరి రోజు అయింది. ఈ రేసులో అతడు టీమ్ బహ్రెయిన్ విక్టోరియస్ తరఫున పాల్గొన్నాడు. గురువారం జరిగిన రేస్‌లో గినో మరికాసేపట్లో ఫినిషింగ్ లైన్ చేరతాడనగా.. అల్‌బులా పాస్ వద్ద అమెరికాకు చెందిన రైడర్ మాగ్నస్ షెఫీల్డ్ ను వేగంగా ఢీ కొట్టాడు. వెంటనే అదుపుతప్పి పక్కన ఉన్న పెద్ద లోయలో పడిపోయాడు. నిర్వాహకులు అక్కడికి వెళ్లి చూసే సరికి గినో అచేతనంగా కనిపించాడు. వెంటనే అతడిని హెలిక్యాప్టర్ ద్వారా చుర్ లోని ఆస్పత్రికి తరలించారు. గినోను బతికించేందుకు అక్కడి డాక్టర్లు ఎంతగానో పరిశీలించారు. మెరుగైన వైద్యం అందిచినా కూడా అతడి శరీరం సహకరించలేదు. దాంతో, గినో శుక్రవారం ఉదయం చనిపోయాడు. గినో ఒక టాలెంటెడ్ సైక్లిస్ట్ మాత్రమే కాదు. అతనొక గొప్ప మనిషి. అతడి అకాలమరణం మమ్మల్ని ఎంతగానో కలిచి వేసింది. ఆట పట్ల అతడికున్న అంకితభావం మా అందరికి స్ఫూర్తిదాయకం. ఈ విషాద సమయంలో అతడి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ కష్టకాలంలో మా ప్రార్థనలు, ఆలోచనలు అతడి ఫ్యామిలీ గురించే ఉంటాయి' అని బహ్రెయిన్ విక్టోరియస్ టీమ్ డైరెక్టర్ మిలన్ ఒక ప్రకటనలో తెలిపాడు.

# భారీ ఆధిక్యంలో బంగ్లా జట్టు



ఢాకా,జూన్16 : బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు తాజాగా అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ప్రత్యర్థి జట్టుకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. బంగ్లాదేశ్ టీమ్ తన టెస్టు క్రికెట్ చరిత్రలో ప్రత్యర్థికి అంత లక్ష్యాన్ని నిర్దేశిరచడం ఇదే తొలిసారి. గత బుధవారం మ్యాచ్ మొదలుకాగా.. బంగ్లాదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 382, రెండో ఇన్నింగ్స్‌లో 425 పరుగులు చేసింది. అఫ్ఘానిస్థాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 146 పరుగులకే కుప్పకూలింది. దాంతో ఆ జట్టు ముందు బంగ్లాదేశ్ జట్టు 662 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఇవాళ మూడో రోజు ఆట పూర్తయ్యేసరికి అఫ్ఘానిస్థాన్ జట్టు రెండు వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. అఫ్ఘాన్ గెలువాలంటే ఆఖరి రెండు రోజుల్లో 617 పరుగులు చేయాలి. డ్రాగా ముగించాలంటే రెండు రోజుల్లో మిగిలిన 8 వికెట్లు పడకుండా కాచుకోవాలి. ఈ రెండు సాధ్యమయ్యే పని కాకపోవడంతో అఫ్ఘానిస్థాన్ ఓటమి దాదాపు ఖారరైనట్లే. కాగా, బంగ్లాదేశ్ గతంలో ప్రత్యర్థికి విధించిన అత్యధిక లక్ష్యం 477 పరుగులు. 2021 జూలైలో జింబాబ్వే జట్టుకు బంగ్లా ఈ లక్ష్యాన్ని నిర్దేశిరచింది. ఇక టెస్టు క్రికెట్ చరిత్రలో అన్ని జట్లను పరిగణలోకి తీసుకుంటే ఇప్పటివరకు ఇంగ్లండ్ జట్టు ప్రత్యర్థి ముందు రికార్డు లక్ష్యాన్ని ఉంచింది. 1930లో వెస్టిండీస్ జట్టుకు ఇంగ్లండ్ 836 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశిరచింది. ఇదే ఇప్పటివరకు రికార్డుగా ఉంది.

# ఇండోనేసియా ఓపెన్ టోర్నీ

## క్వార్టర్ ఫైనల్‌కు శ్రీకాంత్,ప్రణయ్,సాత్విక్

జకార్త,జూన్16 : ఇండోనేసియా ఓపెన్‌లో వెటరన్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్‌తోపాటు సాత్విక్ జోడీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకుపోయింది. అయితే రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు ఓటమితో టోర్నీ నుంచి వైదొలగింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌ఫైనల్లో శ్రీకాంత్ 21-17, 22-20తో సహచర



యువ షట్లర్ లక్ష్యసేన్‌పై విజయం సాధించాడు. మరో సింగిల్స్‌లో ఏడో సీడ్ ప్రణయ్ 21-18, 21-16తో అంగస్ ఎంగ్ కా లాంగ్ (హాంకాంగ్)ని చిత్తుచేసి క్వార్టర్స్ చేరాడు. ఇంకో మ్యాచ్‌లో ప్రియాన్షు రజావత్ 22-20, 15-21, 15-21తో వరల్డ్ నెం.2 ఆంథోని గిన్‌టింగ్ చేతిలో పోరాడి ఓడాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ పీవీ సింధు 18-21, 16-21తో చిరకాల ప్రత్యర్థి, వరల్డ్ నెం.3 తై జు యింగ్ (తైపీ) చేతిలో మరోసారి పరాజయం చవిచూసింది. గత రెండు టోర్నమెంట్ల లోనూ సింధు తొలి రౌండ్లలోనే తిరుగుముఖం పట్టడం గమనార్హం. ఈ గెలుపుతో సింధుపై తన ఆధిక్యాన్ని తైజు 19-5కి పెంచుకుంది. ఇక పురుషుల డబుల్స్‌లో ప్రపంచ ఐదో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి 21-17, 21-15తో హావో (చైనా)పై నెగ్గి క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092,PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com